
మనం నేడు సామాజిక, రాజకీయ, ఆర్థిక కారణాల వలన చిన్న చిన్న వర్గాలుగా విడిపోయి వున్నా, ఒకే జాతిగా నిలబడగలమని నేను విశ్వసిస్తున్నాను.

-డా. బి.ఆర్.అంబేడ్కర్

(రాజ్యాంగ సభలో డిసెంబర్ 13, 1947)



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 59 | శుక్రవారం 25 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## రష్యాలో కూలిన విమానం..

- 49 మంది మృతి

మాస్కో - సూర్య వాస్తవం, జూలై 24

రష్యాలోని తూర్పు అమూర్ ప్రాంతంలో గురువారం ఉదయం ప్రయాణికుల విమానం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 49 మంది మరణించగా, మృతుల్లో ఐదు గురు చిన్నారులు వున్నట్లు అధికారులు తెలిపారు. తొలుత ఈ విమానం అదృశ్యమైందని భావించారు.

2లో



## భారతీయులకు ఉద్యోగాలివ్వొద్దు

- గూగుల్, మైక్రోసాఫ్ట్‌లకు ట్రంప్ హుకుం

వాషింగ్టన్ - సూర్య వాస్తవం, జూలై 24

భారత్‌సహా విదేశాల నుంచి ఉద్యోగులను నియమించడం ఆపాలని అమెరికా టెక్ కంపెనీలపై

2లో




## 31 వరకు పేర్ని, రైలేలపై కఠిన చర్యలొద్దు

- పోలీసులకు ఇచ్చిన గత ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటన

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24

వైసిపి కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యేలు పేర్ని నాని, రైలే అనిల్ కుమార్‌లపై పామర్రు పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ ఈ నెల 31కి వాయిదా పడింది. అప్పటి వరకు వారిద్దరిపై

2లో

## అంచనాలకు మించి రాణించారు

- రేవంత్ రెడ్డి-కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ ప్రశంసలు
- తెలంగాణ వద్ద ఉన్నంత డేటా మరో రాష్ట్రంలో లేదన్న రాహుల్ గాంధీ
- తెలంగాణ కులగణన దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుంది




న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 24

భారతదేశంలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న స్థాయిలో సమగ్రమైన డేటా మరే ఇతర రాష్ట్రానికీ లేదని లోక్‌సభలో

- మిగతా 2లో..

## క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం

- బ్రిటన్‌లో పర్యటిస్తున్న భారత ప్రధాని మోదీ
- చారిత్రక ఒప్పందంపై సంతకాలు
- భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం మొదలైందన్న మోదీ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 24

బ్రిటన్‌తో కీలక వాణిజ్య ఒప్పందం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆయన బ్రిటన్ పర్యటనలో

- మిగతా 2లో..

## పిపిపి విధానంలో రాష్ట్ర హైవేలు

- రూ.వెయ్యి కోట్లతో 2 వేల కిలోమీటర్ల కొత్త రోడ్లు
- 15 రోజుల్లో సమగ్ర నివేదిక
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24

రాష్ట్ర హైవేలను పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు మరింత అధ్యయనం చేసి తుది నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 20 కిలో మీటర్ల కంటే పొడవైన రాష్ట్ర హైవేలు 260 వరకూ ఉండగా, 10,200 కిలో మీటర్ల పొడవైన వీటిని పిపిపి విధానంలో చేపట్టేందుకు మూడు ఫేజ్‌లుగా అధికారులు రూపొందించిన ప్రతిపాదనలపై సిఎం సానుకూలంగా స్పందించారు. రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి

- మిగతా 2లో..

## క్వాంటం వ్యాలీలో క్యుపీ ఎఐ భాగస్వామ్యం

- సిఎంతో సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్ భేటీ

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి క్వాంటం వ్యాలీలో క్యుపీ ఎఐ భాగస్వామ్యం కానుంది. నేషనల్ క్వాంటం వ్యాలీ మిషన్లో భాగంగా తొలిసారి అమరావతిలో ఏర్పాటు చేస్తున్న వ్యాలీలో ఈ సంస్థ 8 క్యూబిక్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీనిపై గురువారం సంస్థ వ్యవస్థాపకులు నాగేంద్ర నాగరాజన్ సిఎం చంద్రబాబునాయుడుతో చర్చించారు.

ప్రజలకు అవసరమైన ఆవిష్కరణలు, విద్యార్థుల పరిశోధనకు ఉపయోగపడే కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిఎం అన్నారు. దీంతోపాటు



అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల విద్యార్థులు, పరిశోధకులు స్టార్టప్ క్వాంటం ఆల్గారిథమ్స్ అప్లికేషన్లను రూపొందించుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

- మిగతా 2లో..

## సింగపూర్‌తో మైత్రికి ప్రయత్నం

- గత ప్రభుత్వం స్నేహాన్ని విచ్ఛిన్నం చేసింది
- మంత్రివర్గ సహచరులతో సిఎం చంద్రబాబు



అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24

సింగపూర్తో పాత మైత్రిని పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తన సహచర మంత్రులకు వివరించారని సమాచారం. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో చంద్రబాబు విడిగా భేటీ అయ్యారు. దీనికోసమే తాను సింగపూర్ పర్యటనకు వెళ్తున్నట్లు ఆయన చెప్పారని తెలిసింది. రాష్ట్ర విభజన అనంతరం సింగపూర్ ప్రభుత్వం ముందుకువచ్చి ఎంతో సహకారం అందించిందని గుర్తు చేశారు. రాజధాని నిర్మాణం, సీడ్ ఏరియా అభివృద్ధికి కన్సార్టియంతో

- మిగతా 2లో..



## దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు!

- మంగళగిరిలో టాప్-20 జ్యుయలరీ సంస్థల యూనిట్లు స్థాపించేలా చర్యలు - ప్రతిఏటా 4 వేల మందికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ
- అధికారులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమీక్ష

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## అపోహలతో కూడిన ఊహాజనిత చిత్రం

- చరిత్రలో అసలు వీరమల్లు లేడు
- పవన్ ఇలాంటి సినిమాలు చేయవద్దు....
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24:

హరిహర వీరమల్లు సినిమా ఓ కల్పిత కథ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. అభిమానులు, ప్రజలు దీనిని ఓ చారిత్రక ఘట్టంగా భావిస్తున్నారని, అపోహలతో కూడిన ఈ ఊహాజనిత చిత్రం ముస్లీం వ్యతిరేక విద్వేషాలు పెరగటానికి దారి తీస్తుందని అన్నారు. మొగలులతో పోరాడి హరిహరవీరమల్లు కోహినూర్ వజ్రాన్ని తీసుకువచ్చినట్లుగా కథకథలుగా సినిమా పేరుతో ప్రచారం జరుగుతోందన్నారు. చరిత్రలో అసలు వీరమల్లు లేదని మొగలులు, కోహినూర్ వజ్రం ఆధారంగా ముస్లీం సమాజానికి వ్యతిరేకంగా సినిమా తీశారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. బాధ్యతాయుతమైన రాజకీయ హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్‌కు ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిందిపోయి కల్పిత కథలను చరిత్ర కింద చూపించడం సరికాదన్నారు. కాబట్టి సినిమాలో, పోస్టర్లపై

- మిగతా 2లో..



# అపోహాలతో కూడిన ఊహాజనిత చిత్రం

(మొదటిపేజీ తరువాయి)



ఇది చరిత్ర కాదు కల్పిత కథ అని వేయాలని డిమాండ్ చేశారు. మొగలులు ఎన్నో అరాచకాలు చేశారని కానీ వాళ్ల సంపద అంతా ఇక్కడే ఉండిపోయిందన్నారు. ఆఖరి మొగల్ చక్రవర్తికూడా బ్రిటీష్ వాళ్లతో కొట్లాడరని చెప్పారు. మొగల్ రాజులు చెడ్డవారు కాదని మంచివాళ్లు కూడా ఉన్నారని తెలిపారు. ఆ వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా పవన్ ఇలాంటి సినిమాలు చేయవద్దన్నారు. పవన్ తన పలుకుబడి ఉపయోగించి మోడీతో మాట్లాడి కోహినూర్ ను లండన్ నుండి రప్పించే ప్రయత్నం చేయాలన్నారు. అది చెప్పకుండా సంపద దోచుకున్న బ్రిటీష్ వాళ్ల గురించి చెప్పకుండా ముస్లీంలను శత్రువులుగా చూపిస్తే ఎవరూ అంగీకరించరని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మత సామరస్యానికి పెట్టింది పేరని అస్సలు ఇలాంటివి అంగీకరించరని అన్నారు.

# రష్యాలో కూలిన విమానం..

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని నిముషాల తర్వాత మంటల్లో దగ్ధమౌతున్న విమాన ప్రధాన భాగం శకలాలను సహాయక హెలికాప్టర్ గుర్తించినట్లు అత్యవసర సేవల విభాగ అధికారి ఒకరు తెలిపారు. అంగారా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎఎన్-24 విమానం గురువారం ఉదయం అముర్ ప్రాంతంలోని బ్లాగోవెష్‌చెన్స్క్ నుండి చైనా సరిహద్దులోని టిండా పట్టణానికి వెళుతోంది. ఆ సమయంలో విమానంలో 43మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. గమ్యస్థానికి దగ్గర్లో ఉండగా విమానానికి ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్స్‌తో సంబంధాలు తెగిపోయాయని స్థానిక మీడియా తెలిపింది. ఈ విమాన ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పేర్కొంది. విజిబిలిటీ తక్కువగా వున్నా, విమానం దిగడానికి సరైన వాతావరణ లేకపోయినా సిబ్బంది ల్యాండింగ్ కోసం యత్నించడమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు మీడియా పేర్కొంది.

# భారతీయులకు ఉద్యోగాలివ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. స్వదేశంలోని ప్రజలకు మరింతగా ఉపాధి కల్పించేలా అమెరికన్ కంపెనీల చర్యలు వుండాలని స్పష్టం చేశారు. చైనాలో ఫ్యాక్టరీలు నిర్మిస్తూ, భారత్ నుంచి ఉద్యోగులను నియమించుకుంటూ, ఐర్లాండ్‌లో లాభాలు దాచుకుంటూ, అమెరికాలో అందే, సదుపాయాలు, సౌకర్యాలు అనుభవిస్తామంటే కుదరదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వదేశంలోని ఉద్యోగులను తొలగించడం లేదా తగ్గించడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇకపై ఆ రోజులు చెల్లవని హెచ్చరించారు. అమెరికాను అగ్రస్థానంలో వుంచాలని సదస్సుకు హాజరైన టెక్ కంపెనీల అధిపతులను ట్రంప్ కోరారు. వాషింగ్టన్‌లో బుధవారం జరిగిన ఎఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా టెక్ పరిశ్రమ ప్రపంచీకరణ విధానాలను అనుసరిస్తున్నందు వల్ల తమను విస్మరిస్తున్నారనే భావన లక్షలాది మంది అమెరికన్లకు కలుగుతోందని అన్నారు.

**ఎఐపై కొత్త బ్లూ ప్రింట్**

ట్రంప్ ప్రభుత్వం బుధవారం ఎఐపై బ్లూ ప్రింట్‌ను విడుదల చేసింది. క్లిష్టతరమైన సాంకేతిక పరిజ్ఞానంలో చైనాపై ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నంలో భాగంగా పర్యావరణ నిబంధనలను సడలించింది. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ 'ఎఐ రేసును ప్రారంభించిన దేశం అమెరికాయే. గెలవబోయేది కూడా మనమే' అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మూడు కార్యనిర్వాహక ఆదేశాలపై సంతకాలు చేశారు. ఈ మార్పుల వల్ల భారత్ ఐటి నిపుణులు, ఔట్‌సోర్సింగ్ సంస్థలు మరిన్ని ఆంక్షలను, అడ్డంకులను ఎదుర్కొనే ప్రమాదం పొంచి వుంది.

# అంచనాలకు మించి రాణించారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష నేతరాహుల్ గాంధీ అన్నారు. దేశంలో కులగణన నిర్వహణకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కులగణనపై ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ప్రజెంటేషన్‌కు రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అంచనాలకు మించి రాణించారని ప్రశంసించారు. కులగణన నిర్వహణ అంత సులభం కాదని ఆయన అన్నారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఈ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని వ్యాఖ్యా నించారు. కార్యాలయాలలో కూర్చొని కులగణన చేస్తే సరైన ఫలితాలు రావని ఆయన అన్నారు. తెలంగాణ కులగణనలో దాదాపు 56 ప్రశ్నలు అడిగారని గుర్తు చేశారు. సరైన డేటా ఉంటే ఏదైనా సాధించగలమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ చేతిలో ఇప్పుడు సరైన డేటా ఉందని రాహుల్ గాంధీ అన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరైన రీతిలో కులగణన చేయదని ఆయన విమర్శించారు. దేశ వాస్తవ చిత్రాన్ని బహిర్గతం చేయడానికి ఆ పార్టీ ఇష్టపడదని వ్యాఖ్యానించారు. సమాజాన్ని వేగంగా అభివృద్ధి చేసే శక్తి విద్యకు మాత్రమే ఉందని ఆయన అన్నారు. హిందీ, ఇతర ప్రాంతీయ భాషలు ముఖ్యం కాదని తాను చెప్పడం లేదని, కానీ ఆంగ్లం కూడా ముఖ్యమేనని ఆయన అన్నారు. బీజేపీ నేతల పిల్లలు ఏ భాషలో చదువుతున్నారని ఆయన ప్రశ్నించారు.

# 31 వరకు పేర్ని, రైలేలపై కఠిన చర్యలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కఠిన చర్యలు తీసుకొవద్దని పోలీసులకు ఇచ్చిన గత ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. వైసీపీ కార్యకర్తల సమావేశంలో తెలుగుదేశం, జనసేన కార్యకర్తల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మచిలీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు పామర్రు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూదాఖలు చేసిన క్వాష్ పిటిషన్లను జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం విచారించారు.

# సింగపూర్‌తో మైత్రికి ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

చేయూతనిచ్చిందన్నారు. అయితే తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం సింగపూర్ కన్సార్టియంను వెళ్లగొట్టారని ఆరోపించారు. వారిపై అవినీతి ముద్ర కూడా వేశాని, చివరికి కేసులు పెట్టేందుకు కూడా ప్రయత్నించారని విమర్శించారు. ఆ దేశంతో అన్ని సత్సంబంధాలను చెడగొట్టారని ఆరోపించారు. అందుకే మళ్లీ వారితో సంబంధాలను మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిం చాల్సి ఉందని, సీడ్ క్యాపిటల్ మినహా మరే ఇతర ప్రాజెక్టు పనులైనా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇప్పటికే సింగపూర్ ప్రతినిధులు చెబుతున్నారని సిఎం అన్నట్టు తెలిసింది.

రాష్ట్రంలో అక్రమ భవనాల క్రమబద్ధీకరణపైనా మంత్రులు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. పెట్టుబడులు, పేదలకు ఇళ్ల స్థలాలు, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, నీటి పన్ను వంటి అనేక ఇతర అంశాలు ఈ అంతర్గత భేటీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా అక్రమంగా నిర్మిస్తున్న భవనాలపై ఇన్నాళ్లూ అనుసరిస్తున్న క్రమబద్ధీకరణ విధానంపై పలువురు మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. అక్రమ కట్టడాలను కూల్చివేసే అంశంపైనా చర్చ జరిగింది. ఇటువంటి నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి కూడా అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం క్రమబద్ధీకరణ చేసి తరువాత చట్టం తీసుకురావాలని నిర్ణయిం చారు. అవసరమైతే బిల్డింగ్ డిమాలిషన్ డ్రైవ్ను కూడా నిర్వహించాలని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ కట్టడాలు నిర్మాణం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**త్వరలో పేదలకు ఇంటి స్థలాలు**

రాష్ట్రంలో నిరుపేదలకు త్వరలోనే ఇంటి స్థలాలు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నట్లు చంద్రబాబు చెప్పా రు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామని, ఈ కార్య క్రమాన్ని వెంటనే అమలు చేయాలని సహచరులకు సూచించారు. మంత్రులు దీనిపై నిశితంగా దృష్టి సారించాలన్నారు. అలాగే నాలా పన్నుపైనా చర్చ జరిగింది.

**తిరుపతి తొక్కిలాటపై క్రిమినల్ చర్యలు**

తిరుపతిలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై జస్టిస్ సత్యనారాయణమూర్తి ఇచ్చిన నివేదికపైనా చర్చించారు. ఇందులో భాగంగానే గోసంరక్షణ అధికారి, ఒక డిఎస్పిపైనా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీపైనా చర్చించారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడలు గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిన బాధ్యతను మంత్రులు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**నేడు 'మెట్రో'లకు టెండర్లు**

విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో మెట్రో రైళ్ల నిర్మాణంపైనా చర్చ జరిగింది. శు క్రవారం ఈ రెండు మెట్రోలకు టెండర్లను పిలువన్నట్లు మంత్రులకు చంద్రబాబు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో ఏభై శాతం వాటాతో ఈ పనులు జరుగుతాయని, ఇందులో భాగంగానే విశాఖ మెట్రోకు 4,101 కోట్లు, విజయవాడ మెట్రోకు 3,497కోట్లు ప్రభుత్వ వాటాగా ఇవ్వనున్నట్లు చెప్పారు.

## క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. క్రికెట్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, అది ఒక ప్యాషన్ అని అభివర్ణించారు. క్రికెట్ తరహాలో భారత్-బ్రిటన్ దేశాల మధ్య దీర్ఘకాల భాగస్వామ్యం కోరుకుంటున్నామని తెలిపారు. "ఈ ఒప్పందంతో భారత్-బ్రిటన్ భాగస్వామ్యంలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇరుదేశాలు విజన్-2035 లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. రక్షణ, భద్రత, కృత్రిమ మేధ (ఏఐ), విద్య, సైబర్ సెక్యూరిటీ, ఇతర రంగాల్లో కలిసి ముందుకు సాగాలని నిర్ణయించాం. 6 బ్రిటన్ వర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తున్నాయి" అని వివరించారు. ఇక, పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన బ్రిటన్ ప్రధానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు. "తీవ్రవాదం విషయంలో రెండు అభిప్రాయాలకు చోటు లేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛను దుర్వినియోగం చేసేవారి పట్ల కఠినంగా ఉంటాం. పలు దేశాల మధ్య తలెత్తుతున్న ఉద్రిక్తతల పట్ల ఆందోళన చెందుతున్నాం. ప్రపంచ దేశాల మధ్య శాంతి పెంపొందించే విషయంలో భారత్-బ్రిటన్ కలిసి ముందుకు సాగుతాయి. ఇది విస్తరణ వాదానికి కాలం కాదు ఇది శాంతికి సమయం" అని మోదీ స్పష్టం చేశారు. అటు, అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపైనా ప్రధాని మోదీ స్పందించారు. "అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో బ్రిటన్ లోని ఎన్నారైలు కూడా ఉన్నారు. విమాన ప్రమాద మృతులకు మరోసారి సంతాపం తెలుపుతున్నాను. ఎన్నారైలు భారత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారు. బ్రిటన్ ప్రధాని ఆతిథ్యానికి ధన్యవాదాలు భారత్ కు రావాలని ఆయనను ఆహ్వానిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు!

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో అత్యుత్తమ మోడల్ తో మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు నిర్మాణంచేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరి జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కు ఏర్పాటుపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... మంగళగిరిలో ఏర్పాటు చేయబోతున్న జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్కుతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందులో ఆభరణాల తయారీలో ప్రపంచస్థాయి శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో టాప్ 20 ఆభరణాల తయారీసంస్థలు మంగళగిరి పార్కులో తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

ఉడిపిలోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ జెమ్స్ అండ్ జ్యుయలరీ (ఐఐజీజే) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దీనిపై స్కిల్ డెవలప్ మెంట్ సీఈవో గణేశ్ కుమార్ స్పందిస్తూ త్వరలో ఏర్పాటుచేసే కామన్ ఫెసిలిటీ సెంటర్ మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ప్రతిఏటా 4 వేలమందికి అధునాతన ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పార్కులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఈఓ), కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్ సీ), ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ అండ్ రిటైల్ జోన్, మ్యానుఫాక్చరింగ్ జోన్, రెసిడెన్షియల్ జోన్, ఇన్ ఫ్రా జోన్ అంతర్భాగాలు ఉంటాయని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... మంగళగిరిలో యువతకు నైపుణ్యశిక్షణ అందించే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ) కూడా త్వరితగతిన ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ఎంసీసీ ద్వారా కెరీర్ కోచింగ్, జాబ్ మ్యాచింగ్, స్కిల్ అప్ గ్రేడేషన్, ఎంప్లాయర్ ఎంగేజ్ మెంట్ చేపట్టాలని అన్నారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన 3 జాబ్ ఫెయిర్లకు 1,170మంది యువకులు హాజరుకాగా, 453 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు తెలిపారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ... ఇకపై ప్రతినెలా జాబ్ ఫెయిర్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, యువతకు నూరుశాతం ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో

## పిపిపి విధానంలో రాష్ట్ర హైవేలు

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2 వేల కిలో మీటర్ల మేర రాష్ట్ర, జిల్లా రహదారులను రూ.వెయ్యి కోట్లతో కొత్తగా నిర్మించాలని సిఎం అధికారులను ఆదేశించారు. మరో రూ.500 కోట్లతో దెబ్బతిన రహదారుల మరమ్మతులు వర్షాకాలంలోనూ కొనసాగించాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ అంశాలపై 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబరు నుంచి కొత్త రహదారుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రతి 50 కిలో మీటర్లకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## క్వాంటం వ్యాలీలో క్యుపీ ఎఐ భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

**వివిధ రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్ సేవలు**

రాష్ట్రంలో వివిధ పంటల సాగులో ఖచ్చితత్వం, తెగుళ్లకు సబంధించిన అంశాలను అంచనా వేసేందుకు క్వాంటం కంప్యూటింగ్ ఉపకరించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తి పెరిగేలా సూచనలు, సలహాలను సకాలంలో ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాలు మెరుగుపడేలా సాంకేతికత దోహదపడాలని సిఎం పేర్కొన్నారు. అలాగే నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వ్యాధుల నిర్ధారణ, మెడికల్ లాజిస్టిక్స్ అంశాల్లో క్వాంటం సిమ్యులేషన్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోందని సిఎం పేర్కొన్నారు.

## వారంలో డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్

**- కళాశాల యాజమాన్య అసోసియేషన్‌తో ప్రభుత్వం**

**అమరావతి - సూర్య వాస్తవం, జూలై 24** : రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను వారంలోపు విడుదల చేస్తామని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య అసోసియేషన్ నాయకులతో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అసోసియేషన్ నాయకులతో రాష్ట్రసచివాలయంలో గురువారం ఆయన పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశ నిర్ణయాలను అసోసియేషన్ నాయకులు మీడియాకు తెలిపారు.

డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్‌లో ఎంచుకొన్న కోర్సులకు వెంటనే ఉత్తర్వులు ఇచ్చి సరళీకృత విధానాలలో అఫిలియేషన్ ప్రక్రియ ముగిస్తామన్నారు. జివో 36 మార్గదర్శకాలు సమీక్ష చేసి రూల్స్ సడలింపు చేస్తామని తెలిపారు. 30 ఏళ్ల రిజిస్టర్ లీజు సబ్మిట్ చేసిన వారికి ఐదేళ్ల గుర్తింపు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఫీజులపై సమీక్ష చేస్తామని తెలిపారు. 30శాతం మేనేజ్‌మెంట్ కోటా విధానంపై విద్యాశాఖ మంత్రి తుదినిర్ణయం తీసుకోవాల్సివుందన్నారు. ఆర్‌టిఎఫ్ పెండింగ్ ఫీజులను వచ్చే నెల నుంచి విడతల వారీగా ఇస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వి చిరంజీవిరావు, రామ్‌గోపాల్ రెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు విజరుభాస్కర్ రెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణజీ, రాజకుమార్ చౌదరి, ఫైనాన్స్ సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మేకిన్ ఇండియా సక్సెస్ స్టోరీ




ఓవైపు రష్యా - ఉక్రెయిన్ యుద్ధం జరుగుతోంది. మరోవైపు ఇజ్రాయెల్ - పాలస్తీనాల మధ్య వార్ సాగుతోంది. ఇజ్రాయెల్ - ఇరాన్ల మధ్య పరిమిత యుద్ధం జరిగింది. ఇదే సమయంలో ఇండియా - పాకిస్థాన్ల మధ్య కూడా యుద్ధం జరిగింది. అయితే, మిగతా యుద్ధాల్లో జరగని చర్చ ఇండియా - పాకిస్థాన్ యుద్ధం తర్వాత జరుగుతోంది. అదే ఆయుధాల వినియోగం. రష్యా ఉక్రెయిన్ కన్నా బలమైన దేశం. ఇజ్రాయెల్ యుద్ధ సన్నద్ధత, ఆయుధ వ్యవస్థల విషయంలో పాలస్తీనా, ఇరాన్ కన్నా బలమైన దేశం. కానీ ఈ రెండు దేశాలు తమ ప్రత్యర్థులపై దాడులు చేసే క్రమంలో వారి బలంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రష్యా రెండేళ్లుగా ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నా, ఆ యుద్ధంలో విజయం సాధించలేకపోతోందన్నది ప్రధాన ఆరోపణ. ఇక ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందినప్పటికీ, ఇరాన్ వేసిన కొన్ని రాకెట్లను అడ్డుకోలేకపోయిందన్న వాదన వినపడింది. బ్రహ్మోస్ క్షిపణులు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా మన దేశం పాకిస్థాన్‌పై తొలిసారిగా బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగించింది. ఇది ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు ఉంది. భారత్ - రష్యా సంయుక్తంగా ఈ మిస్సైల్‌ను డిజైన్ చేసినప్పటికీ, మన దేశ సాంకేతికత, డిజైన్, తయారీలో భాగస్వామ్యం ఎక్కువగా ఉంది. ఈ క్షిపణికి మన దేశంలోని బ్రహ్మపుత్ర నది పేరును, రష్యాలోని మోస్క్వా నది పేర్లను కలిపి ఈ క్షిపణికి బ్రహ్మోస్గా నామకరణం చేశారు. ఈ మిస్సైల్ వేగం, కచ్చితంగా పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలు, కమాండ్ సెంటర్లను ధ్వంసం చేయడంలో కీలకంగా పనిచేశాయి. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మన దేశీయంగా (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థ. ఇది సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థ. ఇది మధ్య శ్రేణి క్షిపణులను, తక్కువ ఎత్తులో వచ్చే శత్రు డ్రోన్‌లను అడ్డుకునేందుకు వినియోగిస్తారు. దీని తయారీలో డీఆర్‌డీవోతో పాటు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి ఉత్పత్తి చేశాయి. ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్స్ 25 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంది. దీని వేగం సూపర్ సోనిక్ వేగంతో ప్రయాణిస్తుంది. అంటే శబ్దం కంటే 2.5 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే క్షిపణి వ్యవస్థగా చెప్పవచ్చు. దీనికి ఉన్న మరో ప్రత్యేకత ఏంటంటే, ఇది డ్రోన్‌లు, యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను, వాటితో పాటు క్రూయిజ్ క్షిపణులను కూడా అడ్డుకోగలదు. అంతేకాదు, ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యం ఆకాష్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. ఇందులో ఏర్పాటు చేసిన రాజేంద్ర అనే రాడార్ వ్యవస్థ మల్టీపుల్-ఫంక్షన్ ఫేజ్డ్-అరే రాడార్ను వినియోగిస్తుంది. ఈ రాడార్ వల్ల ఒకేసారి అనేక టార్గెట్‌లను ఇది ట్రాక్ చేయగలదు. అప్పటికప్పుడు ఆ లక్ష్యాలను ఛేదించేందుకు ఆకాష్ క్షిపణులకు డైరెక్షన్ ఇవ్వగల సామర్థ్యం ఉంది. దీని ద్వారా పాకిస్థాన్ మన సరిహద్దుల నుండి ప్రయోగించిన డ్రోన్‌లను గుర్తించి, వాటిని జామ్ చేసి, ధ్వంసం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సైనిక స్థావరాలతో పాటు డ్రోన్ దాడుల నుండి ప్రజలను, వారి ఆస్తులను కాపాడటంలో విశేషంగా పనిచేశాయని చెప్పాలి. సరిహద్దులను దాటి వచ్చే డ్రోన్‌లను గుర్తించడం, వాటిని జామ్ చేసి ధ్వంసం చేయడం ఈ డీ4 యాంటీ-డ్రోన్ సిస్టమ్స్ పని. మన దేశంలోని కీలక సైనిక స్థావరాలు, వ్యూహాత్మక ప్రాంతాలు, నగరాలు, పట్టణాలను శత్రు డ్రోన్‌ల నుండి కాపాడే రక్షణ వ్యవస్థగా దీన్ని రూపొందించారు. తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్ ఉన్న చిన్నపాటి డ్రోన్‌లను కూడా గుర్తిస్తుంది. డ్రోన్‌ల కమాండ్ అండ్ కంట్రోల్ సిగ్నల్‌లను, అలాగే సిగ్నల్‌లను గుర్తించి, ట్రాక్ చేస్తుంది. పగలు, రాత్రి తేడా లేకుండా డ్రోన్‌లను గుర్తించి నిర్ధారించడానికి, ట్రాక్ చేయడానికి ఇందులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రో-ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఉపయోగపడతాయి. ఇక ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ అల్గోరిథంలను వాడి, ఏ లక్ష్యాన్ని గుర్తించిందో ఆ టార్గెట్ ఉద్దేశాన్ని, ముప్పు ఎక్కడ ఉంది, ఏ స్థాయిలో ఉందని అంచనా వేసి, తదనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉంది. ఇది కృత్రిమ మేధస్సుతో కూడిన గగనతల నియంత్రణ, నివేదన వ్యవస్థగా చెప్పవచ్చు. ఏఐ ఆధారిత వ్యవస్థ. దీన్ని డీఆర్‌డీవో, ఇస్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన వ్యవస్థే ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థగా చెప్పలేం. ఇది వైమానిక స్థావరాలు, రక్షణ సంస్థల ఆస్తులను శత్రువుల దాడుల నుంచి కాపాడుతుంది. శత్రువుల దాడులను ట్రాక్ చేయడం, వాటికి ప్రతిస్పందించడంలో సహాయం చేసే పాత్ర ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ప్రత్యేకత. వివిధ రక్షణ వ్యవస్థల నుంచి అంటే రాడార్లు, క్షిపణి వ్యవస్థలు, శాటిలైట్స్ నుండి వచ్చే సమాచారం సేకరించి, వాటిని పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని ప్రాసెస్ చేసి అందిస్తుంది. ఇందులో ఉపయోగించే ఏఐ టెక్నాలజీ ద్వారా డ్రోన్‌లు, క్షిపణులు, విమానాలను ట్రాక్ చేసి గుర్తించడం, వాటిని ఎదుర్కొనేందుకు తక్షణ నిర్ణయాలను తీసుకుంటుంది. సాధారణ ఎయిర్ డిఫెన్స్‌లతో పోల్చితే ఆకాష్ తీర్ చాలా వేగంగా లక్ష్యాలను గుర్తించి, వేగంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. మానవ ప్రమేయం లేకుండానే శత్రు టార్గెట్‌లను గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు రక్షణ వ్యవస్థలకు ఆదేశాలు ఇవ్వగల సామర్థ్యం ఈ వ్యవస్థ ప్రత్యేకత. డ్రోన్ స్వార్మ్ అంటే ఒకే లక్ష్యాన్ని ఛేదించేందుకు ఎక్కువ సంఖ్యలో వచ్చే డ్రోన్‌లను అడ్డుకుని నియంత్రించగల సామర్థ్యం ఆకాష్ తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థకు ఉంది. పిస్టన్ డ్రోన్ అనేది పిస్టన్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్. డ్రోన్‌లు సాధారణంగా ఎలక్ట్రిక్ మోటార్ల ద్వారా నడిచేలా తయారవుతాయి. ఇందుకు బ్యాటరీలను వినియోగిస్తారు. అయితే, పిస్టన్ డ్రోన్‌లు బ్యాటరీలతో వాడే ఎలక్ట్రిక్ మోటార్లతో కాకుండా పెట్రోల్ లేదా ఇతర ద్రవ ఇంధనాలతో పని చేసే పిస్టన్ ఇంజిన్‌ను వినియోగిస్తారు. పిస్టన్ ఇంజిన్‌లు ఎలక్ట్రిక్ బ్యాటరీల కంటే ఎక్కువ శక్తినిస్తాయి. ఎక్కువ సమయం పిస్టన్ డ్రోన్‌లు గాలిలో ఎగురగలవు. దీని ద్వారా సుదూర ప్రాంతాల్లో నిఘా పెట్టడానికి, మ్యాపింగ్ చేయడానికి వినియోగిస్తారు. సుదీర్ఘంగా నిర్వహించే మిషన్లకు ఇది చాలా ఉపయోగం. ఎక్కువ శక్తిని పిస్టన్ ఇంజిన్‌లు విడుదల చేయడం వల్ల ఈ డ్రోన్‌లు బరువు ఎక్కువ ఉండే పేలోడ్‌లు, కెమెరాలు, సెన్సర్‌లను తీసుకుని ప్రయాణించగల సామర్థ్యం ఉంటుంది. ఎలక్ట్రిక్ బ్యాటరీలు ఛార్జ్ టైం ఎక్కువ పడుతుంది. కానీ ఇంధనం నింపడం చాలా తేలిక, తక్కువ సమయంలోనే ఇవి పని చేసేందుకు రెడీగా ఉంటాయి. పిస్టన్ ఇంజిన్‌లు కఠినమైన వాతావరణంలోనూ, అధిక ఎత్తులో పని చేయగలవు. కొన్ని ప్రతికూలతలు లేకపోలేదు. పిస్టన్ ఇంజిన్‌లు ఎక్కువ శబ్దాన్ని చేస్తాయి. సైలెంట్ ఆపరేషన్లలో వీటిని ఉపయోగించడం ప్రమాదకరం. వీటి నిర్వహణ ఎలక్ట్రిక్ డ్రోన్‌లతో పోల్చితే కొంత కష్టమైన పని. ధర కూడా ఎక్కువ. అయితే, వీటిని ఆపరేషన్ సింధూర్‌లో వాడి ఉంటారని నిపుణులు చెబుతున్నప్పటికీ, నిర్దుష్టమైన ఆధారాలు మాత్రం లేవు. అయితే, ఈ దేశీయ తయారీ పిస్టన్ డ్రోన్ కూడా ప్రపంచవ్యాప్తంగా చర్చ సాగుతోంది. ఇలా ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియాలో భాగంగా దేశీయంగా తయారైన యుద్ధ సాంకేతికత, పరికరాలు సర్వత్రా చర్చకు దారి తీయడమే కాకుండా, ఆయా దేశాల మిలటరీ నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధికంగా ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల జాబితాలో తొలి ఐదు స్థానాల్లో నిలిచే భారత్ వైపు ఇప్పుడు ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. దేశీయ ఆయుధ వ్యవస్థలను అవి దిగుమతి చేసుకునే అవకాశం ఉందని ఇప్పటికే ఈ దిశగా మన రక్షణ రంగ వ్యవస్థలతోనూ, కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చలు సాగుతున్నాయని మిలిటరీ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో రక్షణ ఉత్పత్తుల్లో అమెరికా, యూరప్ దేశాలకు గట్టి పోటీనిచ్చే దిశగా ఇండియా సాగుతోందన్నది మాత్రం వాస్తవం.

# దేవ దేవతలకు అత్యంత ప్రీతికరం శ్రావణమాసం

## -నేటి నుండి శ్రావణ మాసం ప్రారంభం



శ్రావణ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. నెల రోజుల పాటు ఉదయం , సాయంత్రం భగవన్నామస్మరణతో మారు మోగు తాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందంటున్నారు పండితులు. అంత గొప్ప పవిత్రమాసం శుక్రవారంతో ప్రారం భమైంది. అంతేకాకుండా ఈ నెలలో ఎన్నో మంచి రోజులు , విశిష్ట పండుగలు రానున్నాయి. సనాతన ధర్మంలో (హిందూ) చంద్రమానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది ఎంతో పవిత్రత కలిగిన శ్రావణమాసం. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది. వర్ష రుతువు ప్రారంభమవుతుంది. త్రిమూర్తుల్లో స్థితి కారుడు దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువుకు ఆయన దేవేరి(భార్య) మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణమాసంగా చెప్పు కుంటారు. వివిధరకాల పూజలు , వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ప్రసాదించే దివ్య మైన మాసంగా పెద్దలు చెబుతారు. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రం కావడం, అటువంటి పేరుతో ఏర్పడిన శ్రావణమాసం మహావిష్ణువు పూజకు ఎంతో ఉత్కృష్టమైనది. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని వేద పురాణాలు చెబుతున్నాయి. శివారాధనకు ఎంతో విశిష్టత: శ్రావణమాసం దక్షిణాయనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ , కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది.

ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళలో స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేస్తే పాపాలు కడతేరుతాయని శాస్త్ర వచనం. సోమవారాల్లో శివుడి ప్రీత్యా ర్థం ఈ వ్రతాన్ని (ఉపవాసదీక్షను) చేయాలి. ఈ వ్రతంలో ఉపవాసం ఉండగలిగినవారు పూర్తిగా, అలా సాధ్యంకానీ పక్షంలో రాత్రి పూజ ముగిసిన అనంతరం ఆహారాన్ని భుజించవచ్చు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనేక శుభ ఫలితాలు కలుగు తాయి. వీటికి తోడు శ్రావణ శుక్ల పక్షంలో గల పదిహేను రోజులు ఎంతో విశేషమైన రోజులనీ ఒక్కోరోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలని వేద శాస్త్రలు చెబుతు న్నాయి. ఈ మాసంలో భక్తితో ఆచరించే ప్రతి పూజకు తగిన ప్రతిఫలం ఉంటుం దంటున్నారు పండితులు. మంగళ గౌరీ వ్రతం: శ్రావణ మాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ , మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. ఈ వ్రతాన్ని గురించి నారధుడు సావిత్రికి , శ్రీకృష్ణుడు ద్రౌపదికి తెలిపినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లి అయిన వారు ఆచరించాలి. వివాహ మైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభించాలి. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం క్రమం తప్పకుండా చేయాలి. ఐదు సంవత్సరాల పాటు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్యాపన చేయాలి. దీంతో వారు నిండు సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు ఉంటాయి. వరలక్ష్మి వ్రతం : శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలుకాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరిం చవచ్చు. పూజ మండపంలో నిండు కలశాన్ని ఏర్పాటు చేసుకుని దానికి వరలక్ష్మి దేవి ముఖ ప్రతిమను అలంకరించి పూజ చేయాలి. తర్వాత తొమ్మిది ముడులతో తోరణాన్ని తయారు చేసి పూజ చేసిన అనంతరం ఈ శ్లోకాని పటించాలి. శ్లోకం : బధ్నామి దక్షిణే హస్తే నవసూత్రం శుభప్రదం పుత్ర పౌత్రాభివృద్ధించ దేహిమే రమే అని పటిస్తూ కంకణం చేతికి కట్టుకోవాలి. అలాగే మంత్రాలను పటిస్తూనే ముత్తయిదువులకు వాయి నాలు ఇచ్చి ఆశ్వీరాదాలు తీసుకోవాలి. ఈ వ్రతం స్వయంగా శివుడు పార్వతీదేవికి సూచించి సౌభా గ్యం , మంగళ్య బలాన్ని వివరించినట్లు ప్రసిద్ధి. శ్రావణ మాసంలోని విశిష్టతలు..శుక్ల ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలు న్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణును వును పూజించినట్లయితే మోక్షం లభిస్తుంది. శుక్ల పక్ష పౌర్ణమి: శ్రావణపౌర్ణమి , రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈ రోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షబంధనం జరుపు కుంటున్నాం. అంతే కాకుండా ఈ రోజున నూతన యజ్ఞో పవిత్రధారణ, వేదభ్యాసాన్ని ప్రారంభం చేస్తారు. కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటి ముఖ్య రోజులు వచ్చేవి శ్రావణమాసంలోనే. కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న ఈ నెలలో చేయాల్సిన విధులు, పూజలు, వ్రతాలు, నియమాలు , తూచ తప్పకుండా ఆచరిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయి.

# ఎమ్మెల్యేలు చెప్పింది వినాలి వీరమల్లు

**కాకినాడ- సూర్య వాస్తవం**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం ఇరవై మంది ఎమ్మెల్యేలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారా? అంటే అవుననే అంటున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా సహకరించడం లేదు. టీడీపీ నేతలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రోటోకాల్ పాటించకుండానే కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోవడం లేదని కొందరు అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలసి కూర్చుని మాట్లాడితేనే ఈ సమస్యకు తెరపడుతుందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించింది. పవన్ కల్యాణ్ విజయం సాధించిన పిఠాపురం నియోజకవర్గం మినహాయించి మిగిలిన ఇరవై జిల్లాల్లో కూటమి పార్టీలోని నేతలు జనసేన ఎమ్మెల్యేలకు సహ కరించ డం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే వర్మ తన వర్గాన్ని ప్రత్యేకంగా చూస్తున్నారు. అక్కడ కూడా జనసేన, టీడీపీకి పడటం లేదు. పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆలోచించాలని కోరుతున్నారు. నాగబాబుతో పాటు ఇతర నేతలు అక్కడకు వెళ్లినప్పుడు టీడీపీ కార్యకర్తలు చేసే నినాదాలు ఎలా ఉంటాయో వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇక తాజాగా తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. వివాదాల విషయంలో మాట్లాడాలి అంటే తాను డైరెక్ట్ గానే మాట్లాడతానని, అసలు ఇరవై ఒక్క జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసా? అని బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన కామెంట్స్ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని తాకాయి. అందర్నీ ఒకచోట కూర్చోబెట్టి చర్చ పెడితే డి అప్పుడు తెలుస్తుంది తమ బాధ ఏంటో అని ఆయన అన్నారు. కలసి ఉంటే అందరికీ మంచిదని, లేదంటే.. వచ్చే ఐదేళ్లు అందరూ అడుక్కోవాల్సి వస్తుందని కూడా బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన హెచ్చరికలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. కూటమి ధర్మం ప్రకారం అన్ని పార్టీలకు సమాన హక్కులు ఉండాలని కోరారు. మరొక వైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం ఆగస్టు నెల నుంచి పార్టీ పటిష్టతపై దృష్టి పెడతానని తెలిపారు. పవన్ కల్యాణ్ మాత్రం కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు సమన్వయంతో పనిచేస్తే సరిపోదని, కింది స్థాయిలో సమన్వయం ఉండాలని జనసేన ఎమ్మెల్యేలు కోరుతున్నారు. నియోజకవర్గాల్లో తమ పరిస్థితిని తెలుసుకుంటే పవన్ కల్యాణ్ అలా మాట్లాడరని అంటున్నారు. మొత్తం మీద త్వరలోనే జనసేన ఎమ్మెల్యేలు పవన్ కల్యాణ్ కు తమ పరిస్థితులు వివరించి కూటమిలో పార్టీల సమన్వయానికి కృషి చేయాలని కోరేందుకు సిద్ధమయినట్లు సమాచారం.



**తమ్ముడు... నిర్ణయం ఎప్పుడు**

ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కల్యాణ్ క్లారిటీ ఇచ్చారు. తానే మంత్రి పదవిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చేవిషయంపై ఇప్పటి వరకూ చర్చ అంటూ ఏమీ జరగలేదని తెలిపారు. అయితే ఒక విషయం మాత్రం పవన్ కల్యాణ్ చెప్పారు. చంద్రబాబు నాయుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకున్నారని, కానీ తాను మాత్రమే దీనిపై ఆలోచిస్తున్నానని చెప్పడంతో పవన్ కల్యాణ్ నిర్ణయం వల్లనే నాగబాబుకు మంత్రి పదవి ఆగిందని అనుకోవాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు కొన్నిసార్లు ఇబ్బందులు తప్పవన్న కల్యాణ్ ఆగస్టులో పదవుల విస్తరణపై తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. పవన్ కల్యాణ్ తాజా వ్యాఖ్యలు వింటే నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కుటుంబంలోని వారికే పదవులు ఇస్తున్నారని, ఒకే సామాజికవర్గానికి పదవులను పంచుతున్నారన్న అపప్రధను తాను ఎదుర్కొనాల్సి వస్తుందని పవన్ కల్యాణ్ నాగబాబుకు మంత్రి పదవి విషయంలో ఆలోచిస్తున్నట్లు కనపడుతుంది. ఇప్పటికే జనసేనకు చెందిన ముగ్గరు మంత్రులుంటే అందులో ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారే. శాసన మండలిలో ఉన్న ఇద్దరు కూడా కాపు సామాజిక వర్గానికి చెందిన వారే. ఇక మరో మంత్రి పదవి కూడా కాపు సామాజికవర్గానికి ఇస్తే తనపై కుల ముద్ర పడుతుందేమోనని పవన్ కల్యాణ్ భయపడుతున్నట్లు తెలిసింది.... అందుకే చంద్రబాబు నాయుడు నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని మీడియా సమావేశంలో ప్రకటించి ఇన్ని నెలలు అవుతున్నా జనసేనాని వెనక్కు తగ్గినట్లు తెలిసింది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినందున పార్టీకి అదనంగా లభించే రాజకీయ ప్రయోజనం కూడా ఏమీ లేదని కూడా అంటున్నారు. ఎందుకంటే నాగబాబు కూడా ఫుల్ టైం పొలిటీషియన్ కాదు. ఏపీలో స్థిర నివాసం ఉండరు. ఇవన్నీ ఆలోచించి ఆయనకు ఇవ్వడం కంటే మరొక వ్యక్తికి పదవి ఇస్తే పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు కనపడుతుంది. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చినా యాక్టివ్ గా లేకపోయినా, సరిగా పనితీరు కనపర్చకపోయినా తాను మాట పడాల్సి వస్తుందేమోనని వెనక్కు తగ్గినట్లు కనపడుతుంది. మొత్తం మీద ఏపీ కేబినెట్ లో ఖాళీగా ఉన్న ఒక్క పోస్టు వచ్చే నెలలో భర్తీ అవుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

# రైతుల బాధలు పట్టని మోడీ, బాబు ప్రభుత్వాలు

**- ఇంకెప్పుడు అన్నదాత సుఖీభవ అమలు?**
**- 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు గర్హనీయం**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం, జూలై 24:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి, రాష్ట్రంలోని చంద్ర బాబు ప్రభుత్వానికి రైతుల బాధలు ఏ మాత్రం పట్టడం లేదని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. గురువారం వేంపల్లి లో మీడియా సమావేశం మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు.అసలు కొనేవారు లేరు. పంటల బీమా ప్రీమియం పెంచారు. పంటల బీమా పథకం అమలు కావడం లేదు. ఇన్పుట్ సబ్సిడీ అందడం లేదు. యూరియా కొరత తీవ్రంగా ఉంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయి. 50 కేజీల పొటాష్ ధర రూ 1535 నుండి రూ 1800 కు,10-26-26 ధర రూ 1470 నుండి రూ 1800 కు పెరిగింది. అన్న దాత సుఖీ భవ పథకం కింద ప్రతి ఏటా ప్రతి రైతుకూ రూ 20,000 ఆర్థిక సహాయం చేస్తామని కూటమి పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నాయి. అధికారంలోకి వచ్చి 14 నెలలయింది. ఇప్పటివరకు 20 పైసల సాయం చేయలేదు.

**ఆర్థిక సంఘం నిధులు ఎక్కడ..?:** కేంద్ర ప్రభుత్వం 15 వ ఆర్థిక సంఘం నిధులు గత సెప్టెంబర్ నెలలో రూ 989 కోట్లు,డిసెంబర్ లో రూ 1121 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది. 10 రోజుల్లో ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వా లకు విడుదల చేయాలి.కానీ 9 నెలలైనా కూటమి ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు విడుదల చేయలేదు. ఆ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించింది. నిధులు లేక గ్రామ పంచాయతీలు పారిశుధ్యం,త్రాగు నీటి సరఫరా తదితర విధులు నిర్వహించ లేక పోతున్నాయి. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది కూటమి ప్రభుత్వ వైఖరి అని తులసి రెడ్డి విరుచుకు పడ్డారు.


**కాంగ్రెస్ డిమాండ్లు :** 1. పెండింగ్ బకాయిలతో సహా అన్న దాత సుఖీ భవ పథకం నిధులు వెంటనే విడుదల చేయాలి. 2. పెంచిన రసాయన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి. 3. యూరియా కొరత లేకుండా చూడాలి. 4. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 వ ఆర్థిక సంఘం నిధుల ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు విడుదల చేయాలి.

# అహుడా పనులను వేగవంతం చేయాలి

**- జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, జూలై 24:** అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను సత్వరమే వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ ఆదేశించారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టి.సి. వరుణ్‌తో కలిసి అహుడా పని తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎం.ఐ.జి లేఅవుట్ల భూముల సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసు కోవాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణం అనంతరం ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందిం చగలిగే భూములను గుర్తించాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పెనుగొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కోడూరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, ఇంజనీరింగ్ పనులు, ప్రభుత్వ - ప్రైవేటు భూసేకరణలపై ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్లాట్ల కేటాయింపులో పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగర కేంద్రాలకు దగ్గరగా ఉన్న అభివృద్ధి చేయదగిన నాణ్యమైన భూములపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రోడ్లు, డ్రైనేజీ, ఇతర ప్రాథమిక సదుపాయాలతో కూడిన ప్లాన్లను సిద్ధం



చేసుకోవాలని ఇన్చార్జి కలెక్టర్ సూచించారు. పనులను పూర్తి చేయడంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ శివ్ నారాయన్ శర్మ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జె.పి.ఓ హరీష్ పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీరామలింగ

# చౌడేశ్వరి దేవి పుట్టినరోజు ఉత్సవాలు


**- భక్తుల కోసం ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన**
**శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారు, రామనపల్లి చౌడేశ్వరి అమ్మవారు**

చెన్నూరు- సూర్య వాస్తవం, జూలై 24: చెన్నూరు పెన్నానది తీరంలో పరమట వీధి లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి 96వ పుట్టినరోజు ఉత్సవాలను గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంలో అమావాస్య రోజున చౌడేశ్వరి దేవి అమ్మవారు జన్మించడంతో ప్రతి ఏడాది అమ్మవారి పుట్టినరోజు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. గురువారం ఉదయం శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు పూల అలంకరణలునిర్వహించారు. అమ్మవారి గర్భగుడి ప్రక్కన మందిరంలో శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు భావించడమే కాకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేకమైనటువంటి ఏర్పాట్లు చేయడం జరిగింది. అలాగే రామనపల్లె శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలు పెద్ద సంఖ్యలో బిందెలతో జలాభిషేకం చేశారు. భక్తులకు ఉదయం అల్పాహారం వితరణ ఆలయ కమిటీ వారు నిర్వహించారు. అమ్మవారి పూజలు అనంతరం అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి అమ్మ వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున మహిళలు భక్తులు క్యూ కట్టారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం ఎదుట చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భక్తులకు కమిటీ నిర్వాహకులు అన్నసంతర్పణ నిర్వహించారు.





ఆలయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులకు అనుమతించారు.



## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

**- చలమారెడ్డి పల్లి వద్ద పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్ కడప తహసీల్దార్‌కు అప్పగింత**
**- సిద్దవటం తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు**



**సిద్దవటం - సూర్య వాస్తవం, జూలై 24 :** సిద్దవటం పెన్నానది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిద్దవటం తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాల యంలో గురువారం ఆయన మాట్లాడుతూ కడప నుంచి సిద్దవటం కు వస్తుండగా చల మారెడ్డి పల్లి వద్ద ఒక ఇసుక ట్రాక్టర్ ను పట్టుకుని కడప తహసీల్దార్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా సిద్దవటం మండలం నుంచి కడపకు ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ట్రాక్టర్ ను పట్టుకోవడం జరిగిందన్నారు. అలాగే మూలపల్లి ఇరుగులమ్మ ఆలయం సమీపంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని రోడ్డు కు ట్రాక్టర్ లు వెళ్లకుండా ట్రంచ్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## హార్ట్ స్ట్రోక్‌తో హోంగార్డు మృతి

**- నివాళులు అర్పించిన ఏఆర్ పోలీసు అధికారులు**
**- 10 వేలు ఆర్థిక సాయం**





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూలై 24:** అనంతపురం జిల్లా పోలీస్ ఏ.ఆర్ విభాగంలో పనిచేస్తున్న హోంగార్డు పెద్దన్న గురువారం ఉదయం గుండెపోటుతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో ఉంచిన మృతదేహాన్ని ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్‌లు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు.

## ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి



**పామిడి- సూర్య వాస్తవం, జూలై 24 :** పామిడి మండలం పి.కొండాపురం గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఘనంగా నిర్వహించారు. నేసే కులస్థుల దేవత జయంతి ప్రతియేట ఆషాడ మాసం అమావాస్య రోజు జరుపుకుంటారు. ఉదయం పురోహితులు అభిషేకం, అర్చన,ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళ హారతి గావించారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామోత్సవం, మేళతాలలతో నిర్వహించారు. చుట్టుపక్కల భక్తాదులందరూ పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## శ్రీచైతన్య పాఠశాలలో నాసా అవార్డుల ప్రదానోత్సవం



**పామిడి- సూర్య వాస్తవం, జూలై 24:** స్థానిక పిఎన్‌టి కాలనీలో గల శ్రీ చైతన్య పాఠశాల గుంతకల్లు-2 బ్రాంచ్ కు నాసా హెల్తీ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ లో "స్టేట్ సెకండ్ ప్రైజ్" లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సౌమ్య పదవ తరగతి, ఇందు ప్రియ ఎనిమిదో తరగతి, ఏడవ తరగతి కి చెందిన దీప్తి విద్యార్థులు చేసిన నమూనాలకు ఈ బహుమతి లభించింది. ఇందులో భాగంగా విజేతలకు జ్ఞాపికలను, మెడల్స్‌ను సర్టిఫికెట్లను, స్థానిక ఎంఈఓ మస్తాన్ రావు చేతుల మీదుగా ఏజీయం సుబ్బారెడ్డి, కో ఆర్డినేటర్ కె నాగభూషణం, ప్రిన్సిపాల్ పురుషోత్తం విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని వినియోగించి సాంకేతిక అభివృద్ధిలో భాగం కావాలన్నారు. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్య యాజమాన్యం ప్రతి సంవత్సరం నాసా కాంటెస్ట్ లు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అనేకమైన నమూనాలను పంపి విద్యార్థుల ప్రతిభను చాటి చెప్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులలో గల జ్ఞాన తృష్ణను వెలికి తీసేలా ఉపాధ్యాయులు శ్రమించారని గుర్తు చేశారు. నాసాలో పాల్గొన్న వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో అకడమిక్ డీన్స్ మస్తాన్, ఖాదర్ హుస్సేన్, ప్రైమరీ ఇన్చార్జి హేమావతి, సౌందర్య, నాసా ఇంచార్జ్ రుక్సానా పర్వీన్, సైన్సు ఉపాధ్యాయులు, అలాగే విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఏపీ కేబినెట్ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 24:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం కేబినెట్ సమావేశం జరిగిందని సచివాలయంలో కొన సాగింది. ఈ సమావేశంలో దాదాపు 40కి పైగా అంశాలపై మంత్రివర్గం చర్చిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంత్రి క్యాంప్ కార్యాలయ సమాచారం. ఈ సమావేశంలోనే ఏపీ ఎలక్ట్రా నిక్స్ మాన్యు ఫ్యాక్షరింగ్ పాలసీ పై చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికార వర్గలద్వారా తెలిసింది. రూ.50వేల కోట్లకు పైగా పెట్టుబడులపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు, అదేవిధంగా అమరావతిలో వివిధ నిర్మాణాలకు సంబం ధించి సీఆర్‌డీఏ అథారిటీ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలుపనున్నట్లు, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీక రణకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం సవరణలు చేయనున్నట్లు వారు తెలిపారు. సీఆర్‌డీఏతో పాటు మెట్రోపాలిటన్, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే ప్రక్రియకు కేబినెట్ చట్ట సవరణలు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఏపీ కేబినెట్ సమావేశంలో సహచర మంత్రులతో కలిసి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారని తెలియజేశారు.

## పాము కాటుకు గురైన మహిళా రైతు

### - పరిస్థితి విషమం



**మదనపల్లె - సూర్య వాస్తవ, జూలై 24:** పొలం పనులు చేస్తుండగా పాము కాటేసి మహిళా రైతు పరిస్థితి విషమించింది. గురువారం సాయంత్రం నిమ్మనపల్లె మండలంలో జరిగిన ఘటనపై బాధితురాలి కుటుంబీకులు, జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం, బాలినా యుని పల్లె పంచాయితీ, కత్తిరోపల్లె గ్రామం, గొల్లపల్లికి చెందిన పాలేటి భార్య మహిళా రైతు మంగమ్మ (35) రోజు మాదిరిగానే ఊరికి సమీపంలోనే ఎర్ర చెరువు దగ్గర ఉన్న తన వ్యవసాయ పొలంలో పనులు చేయడానికి వెళ్ళింది. అక్కడ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా, కాలిపై విష సర్పం కాటేసింది. తీవ్ర అస్వస్తతకు గురైన బాధితురాలని గమనించిన కుటుంబీకులు, వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి చికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు వెళ్లాలని రెఫర్ చేశారు. అయితే కుటుంబీకులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## 'సుపరిపాలనలో తొలి అడుగు'పై సమీక్ష

### - టిడిపి నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి



**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 24:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో గురువారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రాయచోటి రూరల్ లో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ కార్యక్రమం పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బూతులలో తక్కువ తిరిగిన కన్వీనర్లను వీలైనంత తొందరగా 100శాతం డోర్ టు డోర్ కార్యక్రమం ముగించాలని కోరారు. అనంతరం ఆయన టిడిపి నాయకులు ఉద్దేశించి మాట్లాడుతూ డోర్ టు డోర్ కార్యక్రమంలో టిడిపి అభివృద్ధి చేసిన ప్రభుత్వ పథకాలలో ప్రజల్లో తీసుకోవాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన ప్రభుత్వ పథకాల ఇక చేయబోయే పథకాల గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలని ఆయన కోరారు.

## ప్రజా రంజక పాలన బాబుకే సాధ్యం

**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 24:** ప్రజా రంజక పాలన అందించడం చంద్రబాబుకే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి అన్నారు. మంగళవారం నాడు కుప్పం మండలం చెక్కునత్తం గ్రామంలో స్థానిక పంచాయతీ టిడిపి అధ్యక్షులు బీరప్ప, వెంకటాచలంల ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళుతూ సంవత్సర కాలంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చే పడుతున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ ఇన్చార్జీలు బాలు, వినోద్ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## రెడ్ బుక్ రాజ్యాంగంతో

# వైసీపీ నాయకులపై అక్రమ కేసులు

### - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట- సూర్య వాస్తవం, జూలై 24:** రెడ్ బుక్ రాజ్యాంగంతో వైసీపీ నాయకులపై అక్రమ కేసులు- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్వర్ణకెరటాలు (నెల్లూరు) ప్రశాంతంగా ఉండే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మొదలుపెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కేసులతో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని, చంద్రబాబు స్క్రిప్ట్ మేరకు నడుచుకునే సిట్ ను ఏర్పాటు చేసి లేని మద్యం దోపిడి జరిగిందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని,ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున గొంతెత్తి ప్రశ్నించే ప్రతి నాయకుడిని అక్రమ కేసులతో అరెస్టులు చేస్తూ జరగని దోపిడీ జరిగిందని తమ పచ్చ మీడియాతో కూటమి ప్రభుత్వం బాకా ఊదిస్తోందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన భూమిక పోషించాల్సిన మీడియా వ్యవస్థను తన కను సైగల్లో పచ్చ మీడియా ద్వారా ప్రజలకు తెలియాల్సిన నిజాలను తెలియజేయకుండా, కూటమి ప్రభుత్వ అరాచక పాలనను కప్పిపుచ్చుకునే విధంగా సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేసేశామని,ప్రజలను ఒక అభూత కల్పన ప్రపంచంలోకి పచ్చ మీడియా,కూటమి ప్రభుత్వం తీసుకు వెళుతున్నాయని తెలిపారు.ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి,ప్రజల తరఫున ప్రశ్నించే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టే కూటమి ఎప్పటికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.ప్రజలు మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తారని, వైయస్ జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రి అవుతారు జగన్ 2.0 పరిపాలనలో తమ మార్క్ ఏంటో చూపిస్తామని కిలివేటి సంజీవయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి, మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు నల్లపురెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, కాకాణి పూజిత పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉండే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మొదలుపెట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను,కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ,అక్రమ కేసులు బనాయిస్తోందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అక్రమ కేసులతో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ని, చంద్రబాబు స్క్రిప్ట్ మేరకు నడుచుకునే సిట్ ను ఏర్పాటు చేసి లేని మద్యం దోపిడి జరిగిందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డిని,మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని,ప్రజల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున గొంతెత్తి ప్రశ్నించే ప్రతి నాయకుడిని అక్రమ కేసులతో అరెస్టులు చేస్తూ జరగని దోపిడీ జరిగిందని తమ పచ్చ మీడియాతో కూటమి ప్రభుత్వం బాకా ఊదిస్తోందన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రధాన భూమిక పోషించాల్సిన మీడియా వ్యవస్థను తన కను సైగల్లో పచ్చ మీడియా ద్వారా ప్రజలకు తెలియాల్సిన నిజాలను తెలియజేయకుండా, కూటమి ప్రభుత్వ అరాచక పాలనను కప్పిపుచ్చుకునే విధంగా సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేసేశామని,ప్రజలను ఒక అభూత కల్పన ప్రపంచంలోకి పచ్చ మీడియా,కూటమి ప్రభుత్వం తీసుకు వెళుతున్నాయని తెలిపారు.ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి,ప్రజల తరఫున ప్రశ్నించే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను ఇబ్బంది పెట్టే కూటమి ఎప్పటికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.ప్రజలు మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తారని, వైయస్ జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రి అవుతారు జగన్ 2.0 పరిపాలనలో తమ మార్క్ ఏంటో చూపిస్తామని కిలివేటి సంజీవయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి, మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, వైసీపీ నాయకులు నల్లపురెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, కాకాణి పూజిత పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.


## బొప్పాయి రైతులకు మద్దతు ధర కల్పించండి

### - చిట్వేలిలో బొప్పాయి రైతులు పెద్ద ఎత్తున ధర్నా



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 24:** చిట్వేలి మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్ రైల్వే కోడూరుకి వెళ్లే కాటా ఆవరణలో బొప్పాయి రైతులు మద్దతు ధర లేకపోవడంతో తీవ్ర ఆవేదనతో గురువారం ఉదయం రైతులందరూ కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. బొప్పాయి రైతులకు టన్నుకు రూ.14,000 వేలు ఉండగా ఉన్నట్టుండి వ్యాపారస్తులు 8,000 కి తగ్గించడంతో బొప్పాయి రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని బొప్పాయి రైతులందరూ కలిసికట్టుగా మాట్లాడుకుని ఒక యూని యన్‌గా ఏర్పడి ప్రతి పంటలో వ్యాపారస్తులు చేస్తున్న అన్యాయానికి మండలంలోని అంబేద్కర్ సర్కిల్ రైల్వే కోడూరు కి వెళ్లే మార్గంలో కాటా నందు ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న చిట్వేలీ మండల ఎస్సై నవీన్, పోలీస్ సిబ్బంది రైతులతో మాట్లాడుతూ వ్యాపారస్తులు, రైతులు మాట్లాడుకొని సామరస్యంగా వెళ్లాలని రైతులకు నచ్చజెప్పి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. అనంతరం మధ్యాహ్నం కాటా ఆవరణలో రైతులందరూ కలిసికట్టుగా ఏర్పడి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వ్యాపారస్తులు బొప్పాయి రైతులకు టన్నుకు 16,000 వేలు మద్దతు ధర ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే క్షేత్రస్థాయిలో ఈ ధర్నాని మరింత బలోపేతం చేసి రైతులతో కలిసి ఎక్కడికక్కడ వాహనాలు నిలుపుదల చేస్తామని రైతులు హెచ్చరించారు. ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి రైతులు వేసిన ప్రతి పంటలో వ్యాపారస్తులు, దళారులు, చేస్తున్న అరాచకాలను, గుర్తించి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున రైతులు ప్రభుత్వానికి తెలియజేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, జూలై 24:** అన్నమయ్య జిల్లా రాయచోటి మండలంలోని దిగువ అబవరం గ్రామం లోని ఆర్‌ఎస్‌కే కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవ సాయం పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాయచోటి డివిజన్‌కు చెందిన నాలుగు మండలాల ఆర్‌ఎస్‌కే సిబ్బంది హాజరయ్యారు. ఈవీసీ విజయ్‌కుమార్ సార్ శాస్త్రీయంగా విషయాలను వివరించారు. జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివనారాయణ ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలు, రైతుల ఆదాయం పెంపు, భూమి ఆరోగ్యంపై వివరించగా,ఈ కార్యక్రమంలో డీపీఎంయు శ్రీ వెంకటమోహన్ లు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వీఏఏ, వీహెచ్ఏలకు విశ్లేషణాత్మకంగా శిక్షణ ఇచ్చారు. రైతులకు ప్రకృతి సాగు పద్ధతులను బోధించడానికి అవసరమైన విజ్ఞానంతో వారు మరింత సిద్ధమయ్యారు.


## పేద విద్యార్థుల అభ్యున్నతికి లక్ష రూపాయల విరాళం

### - బ్రదర్ హుడ్ మ్యూచువల్ ఎయిడెడ్ అండ్ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ సొసైటీకి చెక్ అందజేత



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 24:** పేద విద్యార్థుల పాఠశాల చదువుల కోసం స్కాలర్షిప్ నిధులుగా బ్రదర్ హుడ్ మ్యూచువల్ ఎయిడెడ్ అండ్ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ సొసైటీకి లక్ష రూపాయల విరాళాన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయం రవాణాశాఖ మంత్రి చాంబర్లో బ్రదర్ హుడ్ మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును మంత్రి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## షాదీ మహల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన నాయకులు



**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 24:** ముస్లిం సోదరుల శుభకార్యాలు కోసం కుప్పం పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ స్థానిక మైనారిటి నాయకులతో కలిసి నూతన షాదీ మహల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా టిడిపి మైనారిటీ విభాగం కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు జాకిర్ అహ్మద్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో షాది మహల్ నిర్మాణానికి ప్రభుత్వం 3 కోట్ల 55 లక్షలతో 80 సెంట్లు స్థలాన్ని కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థలాన్ని కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఇందుకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు మైనారిటీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సం ఘం ఏఈ ఆంజనేయులు, సర్వేర్ సాయి, మైనారిటీ నాయకులు సర్దార్, అన్సర్, ఇర్ఫాన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సంతృప్తి చెందేలా
# అధికారులు, సిబ్బంది సేవలందించాలి

**- మార్గదర్శలను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 24:** ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు మరియు సిబ్బంది సేవలందించాలని, మార్గదర్శలను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతి లోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం-పి-4 కార్యక్రమం, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి లేకుండా చూడాలని, ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన వాటిపై సమీక్షిస్తూ ఇసుక లభ్యత, విద్యుత్ అన్నివేళలా అందించడం, విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యలు లేకపోవడం, వంటి అంశాలలో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకో వాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అచ్చెన్నాయుడిపై మహిళా నేతల విమర్శలు



**గుత్తి -సూర్య వాస్తవం, జూలై 24 :** గుత్తి పట్టణంలోని రోడ్లు-భవనాల వసతి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరు బి,నియోజకవర్గ మహిళా అధ్య క్షురాలు,మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి,ఎంపీపీ విశాలాక్షి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డితో పాటు పలువురు వైసీపీ మహిళా నాయకురాలు పాల్గొని అచ్చం నాయుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఆడబిడ్డ పథకాన్ని అమలు చేయాలంటే ఆంధ్రా అమ్మాలి అన్న అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. మహిళలపై ఇటు వంటి దూషణలు చేసి,రాష్ట్ర రాజ కీయాల్లో అవమానకర వాతావర ణం నెలకొల్పడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి,వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనా యించి అరెస్టులు చేస్తోందని మం డిపడ్డారు. వైస్ చైర్మన్ బిందె వర లక్ష్మి మాట్లాడుతూ, చంద్రబాబు చేసిన వాగ్దానాలను అమలు చే యకుండా ప్రజలను మోసం చేశా రు ఆయనపై కేసు పెట్టాలి అని డి మాండ్ చేశారు.అసలు ఏ ప్రభు త్వం అయినా ప్రజల సంక్షేమాన్ని ముందుంచాలని, ఆమోదయోగ్య మైన పాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హిత వు పలికారు.వైఎస్ జగన్‌మోహ న్ రెడ్డి పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయని, అదే కూటమి ప్రభుత్వం వాటి పేర్లు మార్చి పథకాలు తమవిగా ప్రస్తా వించడం విడ్డూరంగా ఉందన్నా రు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేటికీ అమలు కావడం లేదని విమర్శించారు.సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి నెరవేర్చని ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు ప్రజలను మో సం చేశాడని,ఆయనపై కేసు వే యడానికి కూడా తాము సిద్ధమ ని గుత్తి మున్సిపల్ వైస్ చైర్మన్ బిందు వరలక్ష్మి అన్నారు.అచ్చం నాయుడు చేసిన వ్యాఖ్యలకు త క్షణమే క్షమాపణ చెప్పాలని,తా ము ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ తీవ్రంగా అభ్యంతరం తెలుపుతు న్నామని స్పష్టం చేశారు. కౌన్సిలర్ మర్తాడు హసీనా మాట్లాడు తూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వా నికి మరియు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు ఇప్పుడిప్పుడే గమనిస్తూ ఉన్నారని ఆమె తెలిపారు.సంక్షే మ పథకాల్లో అర్హత కలిగిన కు టుంబ సభ్యులందరికీ భాగస్వా మ్యం చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఉ న్నారని ఆమె అన్నారు.ఈ కార్య క్రమంలో పట్టణ అధ్యక్షు రాలు హే మలత రెడ్డి, అంగన్‌వాడీ విభాగ అధ్యక్షురాలు ప్రియాంక, కౌన్సిలర్ మార్తాడు హసీనా, మహిళా నాయకురాలు డా.శాంతిప్రియ, తోట శ్రీదేవి, నారా యణమ్మ, పద్మ, భాగ్యలక్ష్మి, లావణ్య, సత్యప్రియ, పుష్పవాణి, సీనియర్ నాయకులు కోనా మురళీధర్ రెడ్డి, మాజీ జెడ్పి టిసి ప్రవీణ్ కుమార్ యాదవ్, గురుప్రసాద్ యాదవ్, సి.వి.రంగారెడ్డి, వెల్డింగ్ రవూఫ్, మైనార్టీ అధ్య క్షుడు కటిక అన్వర్, ఉపాధ్యక్షులు రంగస్వామి,మండల అధ్యక్షులు గంగరాజు,ఉపాధ్యక్షులు రఘునాథ రెడ్డి, కౌన్సిలర్లు శివ, వరదరా జులు, రమణ, దస్తగిరి, పట్టణ ప్ర ధాన కార్యదర్శి పి.గోపీనాథ్ రెడ్డి, బూత్ కమిటీ ఉపాధ్యక్షుడు రా జు,ప్రచార కమిటీ అధ్యక్షుడు దే వేంద్ర, యువజన విభాగ అధ్యక్షుడు మురళి, వై.బి కుమార్, బ్రాహ్మ ణపల్లి సంజీవరెడ్డి,బళ్లారి హరినా థ్ రెడ్డి,ఎల్ఐసి హరినాథ్ రెడ్డి, తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వాగ్దానాలను వదిలేసిన ప్రభుత్వం

**- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గండికోట శ్రీకాంత్ రెడ్డి**




**రాయచోటి-సూర్య వాస్తవం, జూలై 24:** ఆడబిడ్డ నిధి పథకం ద్వారా నెలకు రూ.1500 అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని ఓ మంత్రి మాట్లా డడం చూస్తే మహిళలను ఆదుకోవాలని ఆలోచనలు ప్రభుత్వానికి రావడం లేదనేది స్పష్టమవుతోందని. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గురువారం ఒక రక్తంలో పేర్కొన్నారు18 ఏళ్ళు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని పూర్తిగా వదిలేసినట్లు గాకనపడుతోందని, బడుగు, బలహీన వర్గా లకు 50 ఏళ్లకు పెన్షన్ హామీని కానీ, అత్యంత ముఖ్యంగా రెండవ ఏడాది ఖరీఫ్ అయిపోతున్నా రైతు భరోసాపై దృష్టి పెట్టడం లేదని ఆ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఒక్కొక్క రైతుకూ రూ.20 వేలు చొప్పున ఈ ప్రభుత్వం బాకీ పడిందన్నారు.

అనేక రంగాలలోనూ పేదల సంక్షేమాన్ని కూటమి ప్రభు త్వం విస్మరించిందన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రభుత్వం 2019-2024 మధ్య జగన్ పాలనలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల ప్రజలను ఆదుకునే విషయంలో ఎక్కడా వెనకడుగు వేయలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని అనవసర విషయాలను ప్రక్కన పెట్టి ప్రజలకు అవసరమైన, సంక్షేమం, బాగోగులపైన దృష్టిపెట్టాలని శ్రీకాంత్ రెడ్డి కూటమి ప్రభుత్వానికి విన్నవించారు.

పదవులు ప్రజల కోసమా? లేక సినిమా టికెట్ల అమ్మకాల కోసమా? బాధ్యతగల ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి తన సొంత సినిమాకు ప్రభుత్వ యంత్రాంగం ద్వారా టికెట్ ధరలను నిర్దేశించుకుని సామాన్యుల నుంచి వసూలు చేసుకుం టున్నారన్నారని అదే ఆరుగాలం శ్రమించి పంటలు పండించుకునే రైతన్న గురించి ఏమాత్రం ఆలోచన చేయడం లేదని, మామిడి పంట పూర్తయిన తరువాత తూతూ మంత్రంగా జిఓ ఇవ్వడం వల్ల రైతులకు ఏమాత్రం లాభం కలుగలేదన్నారు. ప్రజా ప్రతినిధులు సినిమాలను ప్రమోషన్ చేసుకుంటూ, ఊరేగింపు లుచేసుకుంటూ, ప్రభుత్వ అధికారులతో సినిమా టికెట్లను కూడా అమ్మాలని చూడడం ప్రజాస్వామ్య చరిత్రలో మచ్చగా మిగిలి పోతుందని గురువారం విడుదల చేసిన ఆ ప్రకటనలో శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.



# విద్యార్థులు క్రీడలలో రాణించాలి

**కుప్పం- సూర్య వాస్తవం, జూలై 24 :** ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని టిడిపి నాయకులు, కుప్పం 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్ పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని షికారి కాలనీ ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని 11వ క్లస్టర్ ఇన్చార్జి తో పాటు మాజీ ఎంపీటీసీ కృష్ణన్ వితరణగా అందజేశారు. సుమారు పదివేల రూపాయలు విలువచేసే క్రీడా సామాగ్రిని పాఠశాలకు వితరణగా అందజేయడంపై ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ దాతలను అభినందించి, ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 11వ క్లస్టర్ ఇంచార్జి మాట్లాడుతూ గత కొంతకాలం ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు షికారి కాలనీ పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పాఠశాల అవసరాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉపాధ్యా యుల ద్వారా తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపుతూ, పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే పాఠశాల ఆవరణ శుభ్రపరచడం వంటి పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. అలాగే విద్యార్థులను క్రీడల వైపు మళ్లించే క్రమంలో క్రీడా సామగ్రిని వితరణగా అందజేశామన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు పాఠశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దాతలు కాసేపు వాలీబాల్ ఆడుతూ విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు వేలు, తిరుమగళ్, ఆర్ముగం, ఇమ్రాన్, ఇర్ఫాన్, లోకేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూలో అవినీతి అక్రమాలకు చోటు లేదు

**- ఎవరైనా కిందిస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, జూలై 24 :** అన్నమయ్య జిల్లా రాయచోటి లోని రెవెన్యూ కార్యాలయంలో అవినీతి అక్రమాలకు చోటు లేదని తాసిల్దార్ నరసింహా కుమార్ అన్నారు. స్థానిక హాజరు కార్యాలయం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్యాలయంలో ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడిన అనర్హులకు సంబంధించి ఏదైనా అర్హులుగా సృష్టించి ఆన్లైన్ చేయడం తదితర వంటివి చేసినట్లు తమ దృష్టికి వచ్చిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన అన్నారు. కింది స్థాయి సిబ్బందికి ఏదైనా తమకు తెలియనిది ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం అయ్యేలా చూస్తామని అక్కడికి కానట్లయితే జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి ప్రయత్నిస్తామని ఆయన అన్నారు అలా కాకుండా అంతా తామే అయినట్లు తమకు కూడా తెలియకుండా లేదు నీది ఉన్నట్లు ఏదైనా రికార్డులు తెచ్చిన అవి తమ దృష్టికి వస్తే వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ సిబ్బంది రికార్డు సక్రమంగా ఉన్నవే చేస్తూ కార్యాలయానికి వచ్చే వారిని తిప్పుకోకుండా వారికి పని చేసి పంపాలంటూ అని అన్నారు అలా కాకుండా కార్యాలయాలు చుట్టూ రైతులు, ప్రజలను తిప్పుకుంటున్నట్లు తమ దృష్టికి వస్తే వారిని ఉన్నతాధికారుల దృష్టికి తెలిపి తగు చర్యలు తీసుకోబడును అన్నారు.

# గ్రామాలలో సైబర్ మోసాలపై అవగాహన


**- జిల్లా ఎస్పీ ఆదేశాలతో**
**డిజిటల్ వాహనం ద్వారా ప్రజల్లో చైతన్యం**



**గుత్తి - సూర్యవాస్తవం, జులై 24:** సైబర్ సురక్ష (మన భద్రత- మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా గుత్తి మండలం చెట్నేపల్లి, తొండపాడు గ్రామాలలో సైబర్ మోసాలపై అవగాహన సైబర్ సురక్ష (మన భద్రత- మన బా ధ్యత) కార్యక్రమంలో భాగంగా చేపట్టారు.జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీస్ ఆదేశాల మేరకు గుత్తి సి. ఐ వెంకటేశ్వర్లు,ఎస్సై సురేష్ బా బుల పర్యవేక్షణలో పోలీసులు సై బర్ మోసాల పట్ల ప్రజల్లో చైత న్యం తీసుకొచ్చారు.డిజిటల్ వా హనాల ద్వారా సైబర్ నేరాలు ని రోధించడానికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన చేశారు. నిరక్షరాస్యుల్లో సైతం అర్థమయ్యేలా డిజిటల్ వాహనాల ద్వారా వీడియోలు చూయిం చారు.ముఖ్యంగా డిజిటల్ అరె స్టు/ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్,ఇ న్వెస్ట్మెంట్/ క్రిప్టో/స్టాక్ మార్కెట్ ఫ్రాడ్,డెబిట్/క్రెడిట్ కార్డు ఫ్రాడ్/ యూపీఐ ఫ్రాడ్,పార్ట్ టైం జాబ్ / టాస్క్ /జాబ్ ఫ్రాడ్ ఏపీకె/లింక్ / మెసేజీ ఫ్రాడ్.ఎఈపిఎస్ ఫ్రాడ్,ఫే క్ లోన్ యాప్ ఫ్రాడ్స్ పై ప్రొజెక్టర్ ద్వారా వీడియోలు చూయించి వివరిస్తున్నారు.సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి.సైబర్ నేరగా ళ్ల భారిన పడకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అంతేకాకుండా. ఆటోడ్రైవర్లతో సమావేశమై సైబ ర్ మోసాలు గురించి అవగాహన చేశారు.సైబర్ మోసాల అప్రమ త్తతపై తయారు చేసిన పోస్టర్లను ఆటోలకు, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండులలో అతికించా రు.మీరు సైబర్ మోసగాళ్ళ బారి న పడిన వెంటనే మౌనం వీడి సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు సైబర్ క్రైమ్ పోర్టల్ ఙఙఙ.ఛిలివతీఛితీఱఎవ.స్త్రశీఙ.ఱఅ ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఎర్రకోట వేదికపై ధర్మవరానికి ప్రాతినిధ్యం

**- గొట్లూరు సర్పంచ్ నరసమ్మకు అరుదైన గౌరవం**
**- ధర్మవరం నియోజకవర్గానికి గర్వకారణం**
**- మంత్రి సత్య కుమార్ యాదవ్**



**ధర్మవరం – సూర్య వాస్తవం, జూలై 24 :** ఈ ఏడాది 2025, ఆగస్ట్ 15న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ జాతీయ వేడుకలలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం కల్పించింది. ఈ ముగ్గురిలో ఒకరుగా, సత్యసాయి జిల్లా – ధర్మవరం నియోజకవర్గం – గొట్లూరు గ్రామ సర్పంచ్ పిట్టా నరసమ్మ ఎంపిక కావడం ఎంతో గర్వకారణం. గ్రామస్థాయిలో విశేష సేవలందించి, నిబద్ధతతో గ్రామాభివృద్ధికి కృషి చేసిన నాయకురాలిగా ఆమెకు కేంద్రం నుండి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా, ధర్మవరం నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, గురువారం గొట్లూరు గ్రామానికి చేరుకొని నరసమ్మ స్వగృహాన్ని స్వయంగా సందర్శించి, ఘనంగా సన్మానించి ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఫోన్ లో ఆమెతో మాట్లాడి అభినందించారు. "మీ కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించటం అభినందనీయం. మీ వంటి ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి స్ఫూర్తిదాతలు కావాలి. ధర్మవరం ప్రజల తరపున గర్వంగా భావిస్తున్నాను" అని ప్రశంచారు.

# 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎస్ఎం భాష



**గుత్తి – సూర్య వాస్తవం, జులై 24 :**గుత్తి గుంతకల్ నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మ నూరు జయరాం ఆదేశాలు మేరకు వారి తనయుడు గు త్తి,పామిడి ఇంచార్జ్ యువ నేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి పట్టణ అ ధ్యక్షుడు ఎంకె చౌదరి సహ కారంతో గుత్తి పట్టణం 17వ వార్డ్‌లో 17వ వార్డు ఇంచార్జ్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ఎంభాష ఆధ్వర్యంలో 17వ వార్డు180,181 బూతులో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా డోర్ టు డోర్ పర్యటించి ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి వారికి వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ 17 వార్డు 180,181 బూ త్ కన్వీనర్లు మద్దిలేటి రసూ ల్,సురేష్ గౌడ్,టైలర్ సురేష్, మంగళ ట్రైలర్ సురేష్, ట్రాక్టర్ శీను, నరసింహులు, ఎల్లప్ప, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో పార్ట్ టైం లెక్చరర్‌గా ఎంపికైన వారికి అభినందనలు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, జూలై 24:**

అన్నమయ్య జిల్లా రాయచోటిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో గురువారం మోడల్ స్కూలలో గెస్ట్ లెక్చరర్స్‌గా సెలెక్ట్ అయినవారిని అభినందించిన టిడిపి యువ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా వారు ఆయనను దుశాలవా పుష్పగుచ్ఛంతో సత్కరించి సన్మానించారు..



# ఫారం 6, 7, 8 పై ప్రజలకు అవగాహన కల్పించండి

**- సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్**



**హిందూపురం- సూర్య వాస్తవం, జూలై 24 :** హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలలో 1300 పైగా ఉన్న ఓటర్ల పోలింగ్ కేంద్రా లను విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణం లోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నియోజక వర్గ ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చే సుకోవాలని సూచించారు.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించు కోవాలని, ఓటరు నమోదుకు ఫారం-6, ఓటు తొలగింపుకు ఫారం -7, సవరణలకు ఫారం- 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే ప్రతి ట్రాన్స్ జెండర్ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అదే విధంగా రాజకీయ నేతలకు సంబందించిన విద్యా సంస్థల్లో పోలింగ్ బూత్లు ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆటోనగర్ వాసుల కోసం ఆర్టిఓ, బాలికల గురుకుల పాఠశాలలో పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు వివిధ పార్టీ నాయకులు సూచించారు. నూతన ఎ లింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటర్ ఆధార్ అనుసంధాలపై రాజకీయ పార్టీల నాయకులు అంగీకరించారు. దీంతో పాటు జెసి ఫారం 6. 7. 8 పై రాజకీయ పార్టీ నాయకులకు సమగ్రంగా వివరించి దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటే శు, లేపాక్షి తహాసీల్దార్ సౌజన్య లక్ష్మి, చిలమత్తూరు తహసీల్దార్ నటరాజ్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డిప్యూటీ తహాల్దార్ మైనుద్దీన్, ఎన్నికల సీనియ ఎర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, మండల ఆర అమరేంద్ర, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డ నిధి పథకానికి మంగళం పాడిన బాబు

**- వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త దీపికా**



**హిందూపురం- సూర్య వాస్తవం, జులై 24 :** ఎన్నికలకు ముందు ఆడబిడ్డ నీది అంటూ మహిళలను ఆశపెట్టి.... నేడు ఆ పథకానికి మంగళం పాడేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ సిద్ధమైందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి మండ పడ్డారు. మంత్రి అచ్చం నాయుడు ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎత్తివేస్తున్నామని పరోక్షంగా ప్రకటించడం ద్వారా మహిళలను మానసికంగా సిద్ధం చేస్తున్నారని ధ్వజ మెత్తారు. విషయంపై గురువారం స్థానిక పార్టీ కార్యాల యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఏడాది గడిచిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా ఒక్కో పథకాన్ని ఎత్తేసి కుట్రలకు ప్రభుత్వం తెరదీస్తుంది అన్నారు. మోసపు హామీలు ఇచ్చి మహిళల ఓట్లతో గెలిచిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక వంచనకు గురి చేస్తున్నాయని అన్నారు. ఓట్ల కోసం మహిళలు నమ్మించేందుకు ఇంటింటికి మేనిఫెస్టో తీసుకొచ్చి ఫేక్ బాండ్లతో ప్రచారం చేసుకున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది మహిళలు నమ్మించి వందించడానికి చంద్రబాబు మరోసారి సిద్ధమయ్యారని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గతంలోను 2014 -19 మధ్య చంద్రబాబు పాలనలో రూ. 14.204 కోట్ల డాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా మోసం చేశారన్నారు. దీంతో ఆ రుణాలు వడ్డీతో సహా రూ. 25. 424 వేల కోట్లకు చేరుకున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలందరికీ ఆసరా, చేయుత పథకాల ద్వారా రూ. 25.500 కోట్లు వారి ఖాతాల్లోకి జమ చేశామన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పథకాలను ఇస్తూనే సూపర్ సిక్స్ అమలు చేస్తామని పవన్ కళ్యాణ్, చంద్రబాబు, లోకేష్ నమ్మబలికారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆలోచన తప్పించి, వాటిని అమలు చేసే ఆలోచన లేదని తమ చర్యల ద్వారా మరోసారి స్పష్టం చేశారన్నారు. ఆడబిడ్డ నీది పేరుతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న టిడిపి, జనసేన, బిజెపి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన పథకం అమలు మీద దృష్టి సారించలేదన్నారు. అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మళ్ళీ మళ్ళీ అదే వంచన చేస్తున్నారన్నారు. ఆడబిడ్డ నీతి పథకం అమలు చేయాలంటే ఆంధ్రప్రదేశ్ ని అమ్మే యాలంటూ మంత్రి అచ్చం నాయుడు ద్వారా మాట్లాడించి సొంత పథకానికే మంగళం పాడేసే కుట్ర చేస్తున్నారని అర్థమవుతుంది అన్నారు.




# టమోటా మార్కెట్లో లారీ కిందపడి వ్యక్తి దుర్మరణం

**మదనపల్లి- సూర్య వాస్తవం, జులై 24 :** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో వెనక్కి వస్తున్న లారీ కింద పడి యూపీ వాసి దుర్మరణం చెందాడు. గురువారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి రెండవ పట్టణ ఎస్సై రహీం తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కాశిగంజ్ జిల్లా, నంగులా తానాకు చెందిన మోర్ సింగ్(50) అదే ఊరికి చెందిన మరో 80మందితో గ్రామస్తులతో బ్రతుకుతెరువు నిమిత్తం ఐదేళ్ల క్రితం మదనపల్లికి వచ్చారు. నీరు గట్టు వారి పల్లెలోని టమోటా మార్కెట్ యార్డులో ఉన్న ఎల్టిసి మండిలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఓ లారీ రివర్స్ రావడంతో ప్రమాదవశాత్తు కిందపడి చక్రాల కింద నలిగిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ ఎస్ఐ రహీం ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




# శ్రీవారిపై అచంచలమైన భక్తిని చాటుకున్న భక్తుడు

**- మరణానంతరం వీలునామా ద్వారా టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహం, రూ.66 లక్షలు విరాళం**



**తిరుమల – సూర్య వాస్తవం, జులై 24 :** హైదరాబాద్‌కు చెందిన మాజీ ఐఆర్ఎస్ అధికారి స్వర్గీయ శ్రీ వై.వి.ఎస్.ఎస్. భాస్కర్ రావు తన మరణానంతరం వీలునామా ద్వారా టీటీడీకి రూ.3 కోట్ల విలువైన నివాస గృహంతో పాటు తన బ్యాంకు ఖాతాల్లో దాచుకున్న రూ.66 లక్షలను విరాళంగా అందించి అచంచలమైన భక్తిని చాటుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురం ప్రాంతం లో ఉన్న "ఆనంద నిలయం" అనే 3,500 చదరపు అడుగులు గల భవనాన్ని, ఆధ్యాత్మిక కార్యకలాపాల కోసం ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఆయన టీటీడీకి విరా ళంగా ఇస్తున్నట్లు వీలునామాలో పేర్కొన్నారు.

తను బ్యాంకులో దాచుకున్న సొమ్మును టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.36 లక్షలు, శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవేం కటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.6 లక్షలు, శ్రీవాణి ట్రస్టుకు రూ.6 లక్షలు విరాళంగా అందివ్వాలని సంకల్పించారు.తన జీవితాంతం శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో అంకితమై ఉండాలని ఆకాంక్షించిన భాస్కర్ రావు అంతిమ కోరిక మేరకు ఆయన మరణానంతరం ట్రస్టీలు ఎం.దేవరాజ్ రెడ్డి, వి.సత్యనారాయణ, బి.లోకనాథ్‌లు వీలునామా ప్రకారం టీటీడీకి చెందాల్సిన ఆస్తి పత్రాలు, చెక్కులను గురువారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీ.హెచ్. వెంకయ్య చౌదరి అంద జేశారు.ఈ మేరకు భాస్కర్ రావు ట్రస్టీలను అదనపు ఈవో సత్కరించి ఈ సత్కార్యానికి కృషి చేసినందుకు గాను అభినందనలు తెలియజేశారు.

# లేని చరిత్ర, సాగదీత 'వీరమల్లు'




ఎంత కాలంగానో ప్రచారం సాగుతున్న పవన్ కళ్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు' గురువారం విడుదలైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ టికెట్ల భారీ పెంపుతో విడుదలైన ఈ సినిమా పవన్ అభిమానుల అంచనాలను అందుకోలేకపోయింది. 16వ శతాబ్దంలో మొఘల్ సామ్రాజ్యం, కోహినూర్ వజ్రం చుట్టూ అల్లిన ఈ కథలో ముస్లిం ద్వేషం పెంచేలా కొన్ని సంభాషణలు సాగాయి. అసలు చరిత్రలో లేని అంశాలను తెర మీదికి తీసుకొచ్చి, దానికి సనాతనం అనే అతుకుడు ప్రక్రియ సాగించటంలో కథలో క్లారిటీ లోపించింది. అవసరం లేని చోట ఆవేశం తప్ప అసలు కథ లేదు. దీంతో, ఇంటర్వెల్ తరువాతి భాగం సాగదీతగా ప్రేక్షకులను నిరుత్సాహపరిచింది. కథను తెరకెక్కించటంలో జరిగిన విపరీత జాప్యం, చాలా సన్నివేశాల రూపకల్పనకు పేలవమైన గ్రాఫిక్స్‌ను వాడడం సినిమా నాణ్యతను దెబ్బ తీసింది. చరిత్రతో ముడిపెట్టి ఒక కల్పిత కథను చెబుతున్నపుడు- గొప్ప నైపుణ్యం చూపిస్తే తప్ప దాన్ని ప్రేక్షకులు అంగీకరించరు. రాజమౌళి తీసిన బాహుబలి, మగధీర వంటి సినిమా కథలు కల్పితాలే. కానీ, కథనంలో ఊహించని మలుపులు పుష్కలంగా చూపించారు. ఈ సినిమాలో అలాంటి మలుపులు తక్కువ. కథలో అంతగా అతకని, అవసరం లేని సనాతన భావజాలాన్ని ఇరికించటానికి ప్రయత్నించి, విఫలమయ్యారని పరిశీలకుల భావన. ఈ కథను రాసుకున్న క్రిష్ పూర్తిగా పనిచేస్తే మరోలా వుండేదని, కానీ, ఆ తరువాత స్క్రిప్టులో చాలా మార్పులు చేసి, కథకు పరమార్థం లేకుండా చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. కథ మొదటి భాగం కొంతవరకూ ప్రేక్షకులను కూచోబెడుతుంది. రెండో భాగం అంతకుమించి ఉంటుందని ప్రేక్షకులు భావిస్తారు. కానీ, కథ తక్కువై, ఎలాంటి మలుపులూ లేకుండా నెమ్మదిగా సాగింది. దీనిని రెండు పార్టులుగా తీస్తారని విడుదలకు ముందు ప్రచారం జరిగింది. ఈ సినిమా చూశాక మొదటి భాగంలోనే కథ లేదు.. రెండో భాగంలో చెప్పేదేముంటుంది? అని అభిమానులే వ్యాఖ్యానిస్తున్నారు.

సినిమా సెకండాఫ్‌లో ఢిల్లీకి వెళ్లే బాటలో అడ్డంకులు, ప్రజల సమస్యలు అన్నీ చూపించడంతో సరిపోయింది. క్లయిమాక్స్‌లో పెనుతుఫాను రావడంతో వీరమల్లు.. ఔరంగజేబును కలవడంతో ముగుస్తుంది. అసలు వజ్రం దక్కించు కున్నాడా? లేదా? వేదపండితులు ఏమయ్యారు అనేది చెప్పకుండానే ఎండ్‌కార్డు పడింది. ఏ సినిమా సీక్వెల్ అయినా, తొలి భాగాన్ని అర్థవంతంగా, ఆసక్తికరంగా ముగిస్తూనే- రెండో భాగంపై ఆసక్తిని పెంచాలి. వీరమల్లు అందుకు భిన్నంగా ఉంది.

27 సంవత్సరాల సినీ కెరీర్‌లో పవన్ కళ్యాణ్ అనేక హిట్లు, మరికొన్ని ఫట్లు సొంతం చేసుకున్నారు. ఎఎం రత్నం నిర్మాతగా తెరకెక్కించిన ఖుషి, బంగారం తర్వాత వచ్చిన మూడో సినిమా ఇది. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిన ఈ సినిమా ప్రారంభమైన ఐదేళ్ల తర్వాత విడుదలైంది. క్రిష్ దర్శకత్వంలో కొంత భాగం పూర్తయిన సినిమా, ఆయన తప్పుకున్న తర్వాత ఎఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వంలో పూర్తయ్యింది. చెప్పాలనుకున్న కథకు, పవన్ కళ్యాణ్ సనాతన భావ ప్రచారానికి లంకె సరిగ్గా కుదరలేదు. సాంకేతికంగా చాలా లోపాలు కనిపించాయి. గ్రాఫిక్స్ పేలవంగా తేలిపోయాయని పవన్ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న సినిమాలకు సైతం అద్భుతమైన వీఎఫెక్స్ వాడుతుండగా- ఈ సినిమాకు చాలా పేవలమైన సీజీ వర్క్ నడిచిందనే చెప్పాలి. వీరమల్లు ఢిల్లీకి వెళ్తున్నప్పుడు కొండ చరియలు విరిగిపడడం వంటి సన్నివేశాల్లో గ్రాఫిక్స్ ప్రేక్షకులను గొప్ప అనుభూతి కలిగించవు. ఈ సినిమా విడుదలకు ముందే ఓటీటీ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్ పొందింది.

**కాల్పనిక కథతో చరిత్రపై అపోహలు:**

చారిత్రక వాస్తవాలపై ఆధారపడి కాకుండా ఊహాజనితమైన కాల్పనిక కథతో తీసిన సినిమా ఇది. ఈ ఊహాజనిత చిత్రం మత విద్వేషాన్ని పెంచటానికి దారి తీసే ప్రమాదం ఉంది. మొఘల్ సామ్రాజ్యం, కోహినూర్ వజ్రం లాంటి వాస్తవాలను వక్రీకరించేలా చిత్రంలోని సంఘటనలు చూపించారు. బాధ్యతాయుతమైన దర్శక నిర్మాతలు, ప్రజాదరణ ఉన్న నటులూ వాస్తవిక చరిత్రను దృష్టిలో పెట్టుకోవటం, జాతీయ సమైక్యతకు భంగం కలిగించని రీతిలో కథాకథనాలు ఉండేలా చూసుకోవటం చాలా అవసరం. సినిమాలో ఏమి చూపించారంటే: వీరమల్లు చౌర్య నైపుణ్యానికి ఆకర్షితుడై ఒక ప్రాంతీయ రాజు (సచిన్ ఖేడేకర్) అతడి (పవన్ కళ్యాణ్)ని పిలిపించి, విలువైన వజ్రాల గుట్టను దొంగిలించే పనిని అప్పగిస్తాడు: ఆ క్రమంలోనే వీర మల్లుకు దేవదాసి అయిన పంచమి (నిధి అగర్వాల్) తారసపడుతుంది. తరువాత గోల్కొండ నవాబు - వీరమల్లును ఢిల్లీ ఎర్రకోటలో ఉన్న కోహినూర్ వజ్రాన్ని తిరిగి సాధించే పనికి పురమాయిస్తాడు. దానిని సాధించటానికి వీర మల్లు ఏం చేశాడన్నది కథ.సినిమా నిర్మాణానికి ఐదేళ్లు పట్టడంతో - సాంకేతిక లోపాలు చోటు చేసుకున్నాయి. ఐదేళ్లపాటు ఇదే ప్రాజెక్టుతో కట్టుబడి ఉన్న నిధి అగర్వాల్, పంచమి పాత్రకు తన వంతుగా న్యాయం చేసింది. ఆమె రెండు పాటల్లో కనిపిస్తుంది.'యానిమల్' చిత్రంలో తన భీకర నటనకు ప్రశంసలు అందుకున్న బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో నటించారు. హీరో, విలన్ మధ్య సాగే పోరాటాలు అంతగా ఆకట్టుకోలేదు. సహాయక నటీనటుల్లో సత్యరాజ్ కొంత మెరుగైన పాత్ర పోషించారు. రఘుబాబు, సుబ్బరాజు, సునీల్ పాత్రలు సాధారణంగా ఉన్నాయి. మొత్తానికి పవన్ అభిమానులను సైతం నిరుత్సాహపరిచిన సినిమాగా 'వీరమల్లు' మిగిలిపోతుంది.ఇదీ, చరిత్ర : కృష్ణానది పరివాహ ప్రాంతంలో లభించిన కోహినూర్ వజ్రం ఆనాడు (దాదాపు 700 ఏళ్ల క్రితం) కాకతీయుల సామ్రాజ్యానికి చేరింది. తర్వాత ఢిల్లీ సుల్తానులకు, వారి నుంచి మొఘల్ చక్రవర్తులకు, వారి నుంచి నాదిర్‌షాకు, వారి నుంచి ఆఫ్ఘనిస్తాన్ రాజులకు చేరింది.

వారి నుంచి పంజాబ్ సిక్కురాజుకు, అక్కడి నుంచి బ్రిటీష్ వారికి లభించింది. బ్రిటీష్ వారు దానిని రహస్యంగా లండన్ తరలించారు.

అది నేటికీ భారత దేశానికి తిరిగి రాలేదు. ఎవరూ రప్పించలేదు. కోహినూర్ వజ్రమే కాదుబీ బ్రిటీష్ వారు మనదేశంలోని సంపదనంతా వారి పాలనలో తరలించుకుపోయారు. తరువాత భారతీయులు కులమతాలకు అతీతంగా అందరూ సమైక్యంగా పోరాడి, స్వాతంత్ర్యం సాధించుకోవటం జరిగింది. ఇలాంటి చారిత్రక నేపథ్యాన్ని వక్రీకరిస్తూ, ముస్లిం వ్యతిరేకతను పెంచే సినిమాలు గత కొన్నేళ్లుగా బాలీవుడ్‌లో వచ్చాయి. ముస్లిములను విలన్లు, దేశద్రోహులుగా చూపించారు. ఆవిధంగానే వీరమల్లు చిత్రంలో చేసిన ప్రయత్నానికి ప్రేక్షకాదరణ అంతంతగానే ఉంది. థియేటర్ల వద్ద మొదటిరోజు మిక్స్‌డ్ టాక్ వినిపించింది.



# పట్టు జారుతోంది

- పంత్, శార్దూల్ పోరాటం భేష్
- ఇండియా 358 ఆలౌట్
- బెన్ స్టోక్స్‌కు ఐదు వికెట్లు
- ఇంగ్లండ్ 225/2



**మాంచెస్టర్:** నాల్గో టెస్ట్‌లో టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ అర్ధసెంచరీకి తోడు ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. వీర్దిరికి తోడు సుందర్ కూడా రాణించడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 358పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఓపెనర్లు డకెట్, క్రాలే అర్ధసెంచరీలతో రాణించడంతో భారత్‌కు దీటుగా సమాధానమిస్తోంది. గురువారం రెండో రోజు ఆటముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 46 ఓవర్లకు రెండు వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. ఒపెనర్లు తొలి వికెట్‌కు 166పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. గురువారం ముందుగా భారత్ ఇన్నింగ్స్‌లో తొలి సెషన్‌లో శార్దూల్ ఠాకూర్(41), వాషింగ్టన్ సుందర్(27)లు. ఇద్దరూ అడ్డుగోడలా నిలిచి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. తొలి సెషన్‌లో వీరిద్దరూ సమయోచితంగా ఆడి ఇంగ్లండ్ బౌలర్లకు పరీక్ష పెట్టారు. సింగిల్స్, డబుల్స్ తీస్తూ.. నెమ్మదిగా స్కోర్‌బోర్డును ముందుకు నడిపించారు. ఆరో వికెట్‌కు కీలకమైన 48 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జంటను విడదీసి స్టోక్స్ విడదీశాడు. దీంతో తొలిరోజు రిటైర్డ్ హర్ట్‌గా క్రీజ్‌ను విడిచిన వికెట్ కీపర్ రిషబ్ పంత్ క్రీజులోకి వచ్చాడు. పాదం నొప్పిని భరిస్తూనే వికెట్ కాపాడకుంటూనే స్కోర్ బోర్డును పరుగెత్తించాడు. వర్షం కారణంగా ముందుగానే లంచ్ బ్రేక్ ఇవ్వగా అప్పటికి భారతజట్టు 6 వికెట్ల నష్టానికి 321 పరుగులు చేసింది. విరామం తర్వాత ఇంగ్లండ్ పుంజుకుంది. ముఖ్యంగా కెప్టెన్ స్టోక్స్.. సుందర్, అన్షుల్ వికెట్లు తీసి ఎనిమిదేళ్ల తర్వాత ఐదు వికెట్ల ఫీట్ నమోదు చేశాడు. ఓ వైపు సహచరులు ఔటవుతున్నా.. పంత్ మాత్రం పట్టువీడలేదు. ఆర్చర్ ఓవర్లో కళ్లు చెదిరే సిక్సర్.. ఆపై స్టోక్స్ బౌలింగ్‌లో కవర్స్ దిశగా బౌండరీతో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఆ తర్వాత ఆర్చర్ బౌలింగ్‌లో బౌల్డ్ అయిన పంత్.. మరి కొద్ది సేపట్లోకే బుమ్రాను వెనక్కి పంపి భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దీంతో భారతజట్టు 114.1ఓవర్లలో 358పరుగుల వద్ద ముగిసింది.

**స్కోర్‌బోర్డు:** భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బ్రూక్ (బి)డాసన్ 58, కెఎల్ రాహుల్ (సి)క్రాలే (బి)వోక్స్ 46, సాయి సుదర్శన్ (సి)కర్సే (బి)స్టోక్స్ 61, గిల్ (ఎల్‌బి)స్టోక్స్ 12, పంత్ (బి)ఆర్చర్ 54, జడేజా (సి)బ్రూక్ (బి)ఆర్చర్ 20, శార్దూల్ (సి)డకెట్ (బి)స్టోక్స్ 41, సుందర్ (సి)వోక్స్ (బి)స్టోక్స్ 27, కంబోజ్ (సి)స్మిత్ (బి)స్టోక్స్ 0, బుమ్రా (సి)స్మిత్ (బి)ఆర్చర్ 4, సిరాజ్ (నాటౌట్) 5, అదనం 30. (114.1 ఓవర్లలో ఆలౌట్) 358 పరుగులు. వికెట్ల పతనం: 1/94, 2/120, 3/140, 4/235, 5/266, 6/314. 7/337, 8/337, 9/349, 10/358

**బౌలింగ్:** వోక్స్ 23-5-66-1, ఆర్చర్ 26.1-3-73-3, కర్సే 21-1-71-0, స్టోక్స్ 24-3-72-5, డాసన్ 15-1-45-1, రూట్ 5-0-19-0

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలే (సి)రాహుల్ (బి)జడేజా 84, డకెట్ (సి) జురెల్ (బి)కంబోజ్ 94, పోప్ 20(నాటౌట్), రూట్ 16 (నాటౌట్). అదనం 9. (46 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 225పరుగులు.



# తెలుగోడు సహా 'టీమ్ ఇండియా'కు గాయాలు

**- యువ పేసర్‌కు చాన్స్ ఇప్పటికే ఐదు టెస్టుల సిరీస్ లో 1-2తో వెనుకబడి..**

ఇప్పటికే ఐదు టెస్టుల సిరీస్ లో 1-2తో వెనుకబడి.. కీలకమైన నాలుగో టెస్టులో కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో టీమ్ ఇండియాకు వరుస షాక్ లు తగులుతున్నాయి. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు గాయం బెడద ఉండగా.. అతడిని అన్ని టెస్టులు ఆడించకుండా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. రెండో టెస్టుకు పక్కనపెట్టి.. మూడో మ్యాచ్ లో ఆడించారు. నాలుగో టెస్టులో ఆడించాలా వద్దా? అనేది పరిశీలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మరో నలుగురు కీలక ఆటగాళ్లకు గాయాలు కావడం ఆందోళన కలిగిస్తోంది.

టెస్టు సిరీస్ నుంచి కీలక ప్లేయర్ ఔట్ ఎడ్జ్ బాస్టన్ లో జరిగిన రెండో టెస్టులో బుమ్రా స్థానంలో వచ్చి పది వికెట్లు (6o4) తీసి గెలుపునకు కారణమైన పేసర్ ఆకాశ్ దీప్ గాయం కారణంగా నాలుగో టెస్టులో ఆడడం కష్టమేనని తెలుస్తోంది. మూడో టెస్టు జరిగిన లార్డ్స్ లోనే అతడు హిప్ ఇంజూరీతో బాధపడినట్లు సమాచారం. ఆకాశ్ కు చికిత్స అందిస్తున్నారు. టెస్టు సిరీస్ ప్రారంభం నుంచి ఆడించాలని డిమాండ్ వస్తున్న ఎడమచేతి వాటం పేసర్ అర్షదీప్ సింగ్ ఏకంగా జట్టుకే దూరం అయ్యాడు. ప్రాక్టీస్ సందర్భంగా బంతిని ఆపబోతే ఎడమచేతికి గాయం అయింది. దీంతో అర్షదీప్ ను భారత్ కు తిప్పి పంపుతున్నారు. 2021 చరిత్ర మళ్ళీ పునరావృతమవుతుందా? లార్డ్స్ టెస్టులో మెరుగ్గా ఆడిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయం బాధితుడేనని తెలుస్తోంది. జిమ్ చేస్తుండగా అతడి మోకాలు దెబ్బతిన్నది. లిగ్మెంట్ కు గాయం అయినట్లు స్కాలింగ్ లో బయటపడింది. దీంతో మిగిలిన రెండు టెస్టులు ఆడడం కష్టమేనని చెబుతున్నారు. మరోవైపు వికెట్ కీపర్ బ్యాట్స్ మన్, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ లార్డ్స్ టెస్టులో వేలి గాయానికి గురయ్యాడు. అయినా రెండో ఇన్నింగ్స్ లో అతడు బ్యాటింగ్ కు దిగాడు. కానీ, సహజ శైలిలో ఆడలేక.. త్వరగా ఔటయ్యాడు. అది జట్టు విజయావకాశాలపై ప్రభావం చూపింది.

పంత్ ను వికెట్ కీపర్ గా కంటే స్పెషలిస్ట్ బ్యాటర్ గా నాలుగో టెస్టులో ఆడించాలని, ధ్రువ్ జురెల్ కు కీపర్ గా చాన్స్ ఇవ్వాలనే సూచనలు వస్తున్నాయి. పంత్ ను కేవలం బ్యాటర్ గా ఆడించే కంటే పూర్తిగా రెస్ట్ ఇవ్వాలని సలహా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి సలహా ఇచ్చాడు. పేసర్ అర్షదీప్ స్థానంలో అన్షుల్ కాంబోజ్ కు తొలిసారిగా జాతీయ జట్టులోకి ఎంపికయ్యాడు. దేశవాళీల్లో 79 వికెట్లు తీసిన అతడు.. ఇటీవలి ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున రాణించాడు. ఇంగ్లండ్ లో ఇండియా ఎ జట్టుకు ఆడాడు. 24 ఏళ్ల అన్షుల్ రెండు అనఫీషియల్ టెస్టుల్లో ఐదు వికెట్లు తీయడమే కాక హాఫ్ సెంచరీ కూడా చేశాడు. ఇన్ని ఇబ్బందుల మధ్య నాలుగో టెస్టులో టీమ్ ఇండియా ఎలాంటి జట్టుతో దిగుతుందో చూడాలి.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )